PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 5 | పేజీలు : 8 | గురువారం 5 నవంబర్ 2026 | వెల : 2/-



బేతుపల్లి చెరువులో కలకలం!

- మత్స్యకారుల రక్షణకు వెళ్లి ప్రమాదంలో సిబ్బంది
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన రెండు బోట్లు
- ఘటనపై సీఎం, డిప్యూటీ సీఎం ఆరా
- గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశాలు



ఖమ్మం

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు వద్ద తీవ్ర ఆందోళనకర ఘటన చోటుచేసుకుంది. చెరువులో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రమాదంలో చిక్కుకున్నారు. సహాయక చర్యల్లో భాగంగా వెళ్లిన రెండు బోట్లు చెరువు అలుగు నీటి ఉధృతికి అదుపుతప్పి కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 11 మంది సిబ్బంది గల్లంతైనట్లు తొలుత వార్తలు వెలువడ్డాయి. ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ - మిగతా3లో



మోదీని ఐదు నిమిషాల్లోనే ఎండగడతా!

- ట్రంప్ నియంత్రణలో ప్రధాని.. దేశద్రోహి అంటూ రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు
- మోదీతో ముఖాముఖి చర్చకు సవాల్.. ఏడాదిలోపే ఎన్డీయే సర్కార్ కూలుతుందని జోస్యం
- అమిత్ షాపైనా విమర్శలు.. అదానీ పోర్టులో పట్టుబడిన డ్రగ్స్ ఏమయ్యాయని ప్రశ్న

తెలంగాణ సంస్కృతికి సదర్ కిరీటం!

హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర

- దున్నరాజుల దర్పం.. సదర్ సంబురం!
- యాదవుల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం!
- రాష్ట్ర పండుగగా గుర్తించాం: సీఎం రేవంత్‌రెడ్డి
- నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు
- హైదరాబాద్ అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకం
- జనాభా ప్రాతిపదికన సముచిత వాటా కల్పిస్తాం



హైదరాబాద్

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతిబింబమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సదర్ అనేది కేవలం ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వేడుక మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, ప్రత్యేకతను చాటిచెప్పే అద్భుతమైన కార్యక్రమమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్ ఉత్సవాలను అధికారికంగా రాష్ట్ర పండుగగా గుర్తించిందని, నిర్వహణ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ - మిగతా3లో



అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్..

- మరో రెండేళ్లు సైన్యంలో సేవలకు అవకాశం!
- 75 శాతం మందికి రెండో విడత సర్వీస్..
- ఆ తర్వాత రెగ్యులర్ ఫోర్స్‌లో చేరే ఛాన్స్
- నాలుగేళ్ల సేవా కాలం ఆరేళ్లకు పెంపు.. అధిక వేతనంతో అదనపు సర్వీస్
- కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు.. 850 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు ఆమోదం


కొరియాలో మళ్లీ ఖాకీ వార్!



- రేషన్ బియ్యం వాహనాన్ని అడ్డుకున్న ఒడిశా పోలీసులు
- ఏపీ ఎన్నికల్లో ఓటు వేయొద్దంటూ ఒత్తిళ్లు.. గ్రామస్థుల ఆగ్రహం
- 21 గ్రామాల్లో 5 ఎంపీటీసీ స్థానాలు.. 2,883 మంది ఓటర్లు

భూమిపైకి నాసా టెలిస్కోప్..
భారత్‌కూ ముప్పు!

- దక్షిణ భారతంలో శకలాలు పడే అవకాశం..
- భూవాతావరణంలోకి ప్రవేశించనున్న 'స్పిఫ్ట్' అబ్జర్వేటరీ
- ప్రమాదం చాలా తక్కువేనని నాసా అంచనా
- 22 ఏళ్ల అంతరిక్ష సేవలకు ముగింపు





రూ.600కే 1,000 కి.మీ. ఈవీ ప్రయాణం!

- రాత్రి విద్యుత్ యూనిట్ రూ.3కు ఇవ్వాలని గడ్కరీ ప్రతిపాదన
- పగటిపూట రూ.5గా నిర్ణయించాలని సూచన
- పెట్రోల్, డీజిల్‌తో పోలిస్తే భారీగా తగ్గనున్న ఖర్చు

రేవంత్ ఈఎంఐ సీఎం

- కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని విమర్శలు
- ఢిల్లీ నాయకత్వానికి రాష్ట్ర నేతల దాసోహం
- మియాపూర్ భూములు అమ్మొద్దని డిమాండ్
- అమిత్ షా పర్యటనతో తెలంగాణకు ఒరిగిందేమిటి?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్

తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ రాజకీయ అవసరాల కోసం పణంగా పెడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఢిల్లీ నాయకత్వం ముందు రాష్ట్రానికి చెందిన నాయకులు తలవంచుతున్నారని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు పార్టీలను మరోసారి నమ్మితే రాష్ట్ర వనరులు ఢిల్లీ లేదా గుజరాత్ చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. జాతీయ పార్టీల నాయకత్వాల ముందు తెలంగాణ నేతలు వ్యవహరిస్తున్న - మిగతా3లో

పేదల సొంతింటి కలకు
మరో అడుగు!

- మరో 4 నగరాల్లో ఇందిరమ్మ టవర్లు!
- నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్‌లో నిర్మాణం
- జీ+5 అంతస్తుల్లో పేదలకు నివాసాలు
- దీపావళిలోపే నోటిఫికేషన్లు: మంత్రి పొంగులేటి



మేడ్చల్

రాష్ట్రంలో మరో నాలుగు నగరాల్లో జీం5 అంతస్తులతో ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ నగరాల్లో ఈ టవర్ల నిర్మాణానికి దీపావళిలోపే నోటిఫికేషన్లు జారీ చేస్తామని తెలిపారు. హైదరాబాద్ తరహాలో అల్పాదాయ వర్గాల కుటుంబాలకు అందుబాటులో ఉండేలా వీటిని నిర్మించనున్నట్లు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్ల - మిగతా3లో



సీఈసీ, ఈసీలకు జీవితకాల రక్షణపై సుప్రీం ప్రశ్నలు!

- 2023 చట్టంలోని సెక్షన్ 16పై కేంద్రానికి నోటీసులు
- ఎన్నికల కమిషనర్లకు సంపూర్ణ మినహాయింపు సమంజసమేనా?
- సదుద్దేశంతో చేసిన పనులకే రక్షణ ఉండాలన్న పిటిషనర్
- ఎస్ఐఆర్ వివాదం, జ్ఞానేశ్ కుమార్ వ్యవహారాల ప్రస్తావన

పాత విద్యాసంస్థలకు ఫైర్ ఎన్‌వోసీ ఊరట!

- పాత స్కూళ్లు, కాలేజీలకు అగ్నిమాపక శాఖ గుడ్‌న్యూస్
- ఫైర్ సేఫ్టీ నిబంధనల్లో కీలక సడలింపులు
- అదనపు స్థలం, రెండో మెట్ల నిబంధనలకు మినహాయింపు

TELANGANA STATE FIRE
DISASTER RESPONSE & FIRE SERVICES
WE SERVE TO SAVE

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
5 నవంబర్ 2026

అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్

న్యూఢిల్లీ: అగ్నివీర్‌లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అగ్నిపథ్ పథకంలో భాగంగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మంది అగ్నివీర్‌లకు మరో రెండేళ్లపాటు సాయుధ దళాల్లో సేవలందించే అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. అనంతరం చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి ఈ వివరాలను వెల్లడించారు.

75 శాతం మందికి రెండేళ్ల పొడిగింపు

2022 జూన్ 14న కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం ఎంపికైన అగ్నివీర్‌లు నాలుగేళ్లపాటు సైన్యంలో సేవలందించాలి. అనంతరం ప్రతిభ ఆధారంగా 25 శాతం మందిని రెగ్యులర్ సాయుధ దళాల్లోకి తీసుకోవాలని తొలుత నిర్ణయించారు. మిగిలిన 75 శాతం మంది సేవల నుంచి వైదొలగాల్సి ఉండేది. అయితే నాలుగేళ్ల పాటు అగ్నివీర్‌ల పనితీరును సమీక్షించిన తర్వాత సానుకూల ఫలితాలు రావడంతో కేంద్రం ఈ విధానంలో మార్పులు చేసింది. మిగిలిన 75 శాతం మందికి అదనంగా రెండేళ్లపాటు సేవలందించే అవకాశం కల్పించాలని నిర్ణయించింది.

ఆ తర్వాత రెగ్యులర్ సర్వీసులోకి..

రెండేళ్ల అదనపు సేవా కాలం పూర్తయిన తర్వాత సాయుధ దళాల్లో కొనసాగేందుకు ఆసక్తి చూపే అగ్నివీర్‌లను నిర్దిష్ట ఎంపిక ప్రమాణాల ఆధారంగా రెగ్యులర్ సర్వీసులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియలో అభ్యర్థుల అర్హత, పనితీరు, నిర్దేశిత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటారు. అదనపు రెండేళ్ల సేవా కాలంలో గతంలో కంటే అధిక వేతనం కూడా అందించనున్నారు. ఈ నిర్ణయంతో అగ్నివీర్‌లకు సైన్యంలో కొనసాగేందుకు మరింత అవకాశం లభించనుంది.

నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన పథకం

దేశ రక్షణ దళాల్లో యువతకు అవకాశం కల్పించడం, సైన్యంలో యువశక్తిని పెంచడం లక్ష్యంగా కేంద్రం అగ్నిపథ్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంపై ప్రారంభం నుంచి పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా నాలుగేళ్ల స్వల్ప సేవా కాలం తర్వాత 75 శాతం మంది బయటకు వెళ్లాల్సి రావడంపై అభ్యంతరాలు వచ్చాయి. వారికి భవిష్యత్తులో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయం అగ్నివీర్‌లకు అదనపు అవకాశాలను కల్పించనుంది.



కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మరోవైపు కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలకు సంబంధించిన కేసులను వేగంగా పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా 850 ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులను కొనసాగించడం, బలోపేతం చేయడంపై నిర్ణయం తీసుకుంది. మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడమే దీని లక్ష్యం.

ఇంధన నిల్వకు రూ.14,500 కోట్లు

పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు 92 గిగావాట్ అవర్ (+జెఫ్ట) సామర్థ్యంతో గ్రిడ్ స్థాయి ఇంధన నిల్వ వ్యవస్థల అభివృద్ధికి రూ.14,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యానికి ఈ నిర్ణయం తోడ్పడనుంది.

కీలక ఖనిజాల ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం

సెమీకండక్టర్లు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాల తయారీ రంగాలకు అవసరమైన కీలక ఖనిజాల ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించేందుకు రూ.2,814 కోట్లతో ప్రత్యేక పథకానికి కేంద్రం ఆమోదం తెలిపింది. లిథియం, నికెల్ వంటి ఖనిజాల ప్రాసెసింగ్‌తో పాటు ముడి పదార్థాల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం ఈ పథకం లక్ష్యం.

మోదీని ఐదు నిమిషాల్లోనే ఎండగడతా!

సంగ్రూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో పనిచేస్తున్నారని ఆరోపించారు. తనతో ముఖాముఖి చర్చకు వస్తే ఐదు నిమిషాల్లోనే మోదీని దేశద్రోహిగా నిరూపిస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీతో చర్చకు సిద్ధమని, అందుకు మధ్యవర్తిగా ఎవరినైనా నియమించుకోవచ్చని సవాల్ విసిరారు. అయితే పార్లమెంటులో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మైక్ కట్ చేస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏడాదిలోపే ప్రభుత్వం కూలుతుంది

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపైనా రాహుల్ విమర్శలు చేశారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు మూడేళ్ల గడువు విధించిన అమిత్ షా అప్పటికి ఆ పదవిలో ఉంటారో లేదోనని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం కూలిపోతుందని జోస్యం చెప్పారు. గుజరాత్‌లోని అదానీ పోర్టులో గతంలో పట్టుబడిన వేల కిలోల మాదకద్రవ్యాలు, హెరాయిన్ సంగతేంటని ప్రశ్నించారు. వాటిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.



డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్యను నిర్మూలిస్తామని అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయిందని రాహుల్ విమర్శించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాంతం నుంచైనా డ్రగ్స్‌ను పూర్తిగా తొలగించగలిగారా? అని ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించే సామర్థ్యం ఆప్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. తాను గతంలోనే పంజాబ్‌లో డ్రగ్స్ సమస్య తీవ్రంగా ఉందని హెచ్చరించినప్పుడు, ప్రతిపక్ష పార్టీలు తన వ్యాఖ్యలను తప్పుబట్టాయని గుర్తుచేశారు.

అదానీ పోర్టులో డ్రగ్స్ ఏమయ్యాయి?

దేశంలో శాంతిభద్రతల గురించి మాట్లాడే ముందు మణిపుర్‌లో నెలకొన్న పరిస్థితులపై కేంద్రం సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. జైళ్లలో ఉన్న గ్యాంగ్‌స్టర్లకు రాజకీయ అండదండలు లభిస్తున్నాయని ఆరోపించారు. అమిత్ షా గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, శాంతిభద్రతల సమస్యలపై కేంద్రం సమాధానం చెప్పాలని నిలదీశారు.

పంజాబ్‌కు కావాల్సింది ప్రజా ప్రభుత్వం

పంజాబ్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని రాహుల్ అన్నారు. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేయాలనుకునే వారిని బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, చివరకు హత్యలు చేయడం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతోందని ఆరోపించారు. పంజాబ్ ప్రజలకు తమ కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని, ఢిల్లీ నుంచి నడిచే ప్రభుత్వం కాదని ఆప్ పాలనను విమర్శించారు. యువతకు ఉద్యోగాలు కల్పించడం, రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొంటూ వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని గెలిపించాలని రాహుల్ పిలుపునిచ్చారు.

కొరియాలో మళ్లీ ఖాకీ వార్!

కొరియా: ఆంధ్రప్రదేశ్--ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొరియా గ్రామాల్లో మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని నేరళ్లవలస, దొరలతాడివలస, నేలవలస గ్రామాల్లో ఆధిపత్య పోరు మళ్లీ రాజుకుంది. నేరళ్లవలసకు నవంబర్ నెల రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు సోమవారం రాత్రి వెళ్లిన జీసీసీ వాహనాన్ని ఒడిశా పోలీసులు అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదానికి తోడు స్థానిక ఎన్నికల వ్యవహారం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది.

రేషన్ వాహనం అడ్డుకోవడంతో ఆగ్రహం

తమకు అందాల్సిన రేషన్ బియ్యం సరఫరాను అడ్డుకోవడంపై స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరళ్లవలసలోని ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఔట్‌పోస్టు వద్దకు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బారికేడ్లు తొలగించాలని, అక్కడ ఏర్పాటు చేసిన టెంట్‌ను తీసివేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలు గ్రామానికి చేరుకున్నాయి. ఇదే సమయంలో ఒడిశాకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులు సుమారు 60 మంది అక్కడికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఒడిశా ప్రభుత్వ తీరును ప్రశ్నించిన కొందరు గిరిజనులపై వారు దాడికి పాల్పడ్డారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ప్రశాంతంగా జీవించే పరిస్థితి కల్పించాలని వారు కోరుతున్నారు.

ఓటు హక్కుపై ఒత్తిళ్లు?

ఏపీలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు వేయవద్దంటూ ఒడిశా అధికారులు, రాజకీయ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకునేందుకు గ్రామానికి వచ్చి హెచ్చరికలు జారీ చేస్తున్నారని చెబుతున్నారు. తమకు రెండు రాష్ట్రాలతోనూ అనుబంధం ఉందని, రెండు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఓటు హక్కును వినియోగించుకుంటామని స్థానికులు స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ



ఒత్తిళ్లకు నిరసనగా కొందరు ఒడిశాకు చెందిన ఆధార్, రేషన్ కార్డులను అధికారుల ఎదుట పడేసినట్లు సమాచారం.

21 గ్రామాల్లో ఎన్నికల ఏర్పాట్లు

కొరియా పరిధిలోని 21 గ్రామాల్లో ఐదు ఎంపీటీసీ స్థానాలకు ఏపీ అధికారులు ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో మొత్తం 2,883 మంది ఓటర్లు ఉండగా, 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒడిశా వైఖరి మరోలా..

మరోవైపు కొరియా ప్రజలు ఈ ఎన్నికలను వ్యతిరేకిస్తున్నారని ఒడిశా రెవెన్యూ మంత్రి సురేశ్ పూజారి తెలిపారు. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకమై కొరియాను కాపాడాలని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. తుపాను సమయంలో ఒడిశా ప్రభుత్వ యంత్రాంగం కొరియా ప్రజలకు అండగా నిలిచిందని, ఈ విషయాన్ని స్థానికులు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ నుంచి వచ్చిన బియ్యం వాహనాన్ని స్థానిక ప్రజలే వెనక్కి పంపించారని ఆయన చెప్పుకొచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఎనిమిది ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించామని మంత్రి వెల్లడించారు. ఏపీ పరిపాలనా అధికారులను కూడా వెనక్కి పంపించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కొరియా పరిధిలోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈసారి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వైపు వాటిని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని సురేశ్ పూజారి వెల్లడించారు. రేషన్ బియ్యం సరఫరా నుంచి మొదలైన వివాదం ఇప్పుడు ఓటు హక్కు, పోలీసుల మోహరింపు, రాజకీయ జోక్యం వరకు చేరడంతో కొరియా గ్రామాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించి గిరిజనుల హక్కులకు భరోసా కల్పించాల్సిన అవసరం కనిపిస్తోంది.

సీఈసీ, ఈసీలకు జీవితకాల రక్షణపై సుప్రీం ప్రశ్నలు!

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు అధికారిక విధుల నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలపై కల్పించిన చట్టపరమైన రక్షణ ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చింది. ఈ రక్షణకు సంబంధించి 2023 చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జయమాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఏమిటీ సెక్షన్ 16?

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలానికి సంబంధించిన 2023 చట్టంలో సెక్షన్ 16ను చేర్చారు. ఈ నిబంధన ప్రకారం ప్రస్తుతం పదవిలో ఉన్న లేదా గతంలో సీఈసీ, ఎన్నికల కమిషనర్లుగా పనిచేసిన వ్యక్తులు తమ అధికారిక విధుల నిర్వహణలో చేసిన పనులు, తీసుకున్న చర్యలు లేదా వెలిబుచ్చిన మాటలకు సంబంధించి వారిపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించడానికి లేదా కొనసాగించడానికి వీలుండదు. అంటే పదవిలో ఉన్న సమయంలోనే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా అధికారిక విధులకు సంబంధించిన చర్యలపై ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధనను సంపూర్ణ మినహాయింపుగా పరిగణిస్తున్న పిటిషనర్ దాని పరిధిని ప్రశ్నించారు.

సదుద్దేశంతో చేసిన పనులకే రక్షణ ఉండాలి

ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది అరుణ్ కుమార్ అగర్వాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున న్యాయవాది నేహా రాథీ వాదనలు వినిపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయడానికి, అనవసరమైన రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులకు గురికాకుండా ఉండటానికి రక్షణ అవసరమేనని పిటిషనర్ అంగీకరించారు. అయితే ఆ రక్షణ పేరుతో అధికారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా పూర్తిస్థాయి నిషేధం విధించడం సరికాదని వాదించారు. ఇతర రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికి కల్పించే రక్షణలకు సైతం కొన్ని పరిమితులు ఉన్నాయని, ముఖ్యంగా సదుద్దేశంతో (గుడ్ ఫెయిత్) విధులు నిర్వర్తించిన సందర్భాలకే రక్షణ వర్తించే విధానం ఉండాలని పేర్కొన్నారు. కానీ సెక్షన్ 16లో అలాంటి పరిమితులు లేకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగం, అవినీతి లేదా చట్టవిరుద్ధమైన చర్యలకు కూడా ఈ నిబంధనను అడ్డుగా ఉపయోగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా సవరణపైనా అభ్యంతరాలు

ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కూడా పిటిషనర్ ప్రస్తావించారు. ఈ ప్రక్రియలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ భద్రత, విశ్వసనీయత, పనితీరుపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలను ఉదహరించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, సాంకేతిక వ్యవస్థల విశ్వసనీయత ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అవకతవకలు జరిగినప్పుడు బాధిత ఓటర్లు, అభ్యర్థులు న్యాయపరమైన పరిష్కారం కోరే అవకాశం ఉండాలని పిటిషనర్ వాదించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడటం ఎంత ముఖ్యమో, దాని అధికారుల నిర్ణయాలకు జవాబుదారీతనం ఉండటం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

భూమిపైకి నాసా టెలిస్కోప్.. భారత్‌కూ ముప్పు!

వాషింగ్టన్: అంతరిక్ష రహస్యాలను ఛేదించడంలో దాదాపు 22 ఏళ్లపాటు సేవలందించిన నాసా 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించనుంది. నవంబర్ 4న ఈ ప్రక్రియ జరిగే అవకాశం ఉందని నాసా, అమెరికా అంతరిక్ష దళం అంచనా వేస్తున్నాయి. టెలిస్కోప్‌లోని అధిక భాగం వాతావరణంలోనే కాలిపోయే అవకాశమున్నప్పటికీ, కొన్ని భాగాలు శకలాల రూపంలో భూమిని చేరవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ శకలాలు పడే అవకాశం ఉన్న విస్తృత ప్రాంతంలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అయితే, కచ్చితంగా ఎక్కడ పడతాయో ముందుగానే చెప్పడం సాధ్యం కాదని నాసా స్పష్టం చేసింది.

22 ఏళ్ల అద్భుత ప్రయాణం

2004 నవంబర్ 20న ప్రయోగించిన స్విఫ్ట్ అబ్జర్వేటరీని తొలుత రెండేళ్ల ప్రాథమిక సేవల కోసం రూపొందించారు. అయితే, అంచనాలకు మించి రెండు దశాబ్దాలకుపైగా పనిచేసింది. విశ్వంలో అత్యంత శక్తిమంతమైన పేలుళ్లుగా భావించే గామా కిరణాల విస్ఫోటనాలను గుర్తించి అధ్యయనం చేయడం దీని ప్రధాన లక్ష్యం. ఈ కాలంలో 2,000కు పైగా గామా కిరణాల విస్ఫోటనాలను పరిశీలించింది. సూపర్‌నోవాలు, బ్లాక్‌హోల్స్, ఇతర ఖగోళ వస్తువులపై పరిశోధనలకు విలువైన సమాచారాన్ని అందించింది.

కక్ష్య నుంచి కిందికి..

సూర్యుడిపై పెరిగిన కార్యకలాపాల ప్రభావంతో భూమి ఎగువ వాతావరణం విస్తరించింది. దీంతో తక్కువ భూ కక్ష్యలో పరిభ్రమిస్తున్న స్విఫ్ట్‌పై వాతావరణ ఘర్షణ పెరిగి, దాని వేగం తగ్గుతూ క్రమంగా కక్ష్య దిగువకు చేరింది. టెలిస్కోప్ కక్ష్యను పెంచి మరికొంతకాలం సేవలు అందించేలా చేసేందుకు నాసా ప్రయత్నించింది. ఇందుకోసం 'లింక్' అనే రోబోటిక్ అంతరిక్ష నౌకను పంపించింది. అయితే, ఆ నౌకలో తలెత్తిన నియంత్రణ సమస్యల కారణంగా టెలిస్కోప్‌ను పై కక్ష్యకు చేర్చే ప్రయత్నం విఫలమైంది. దీంతో స్విఫ్ట్ సేవలకు ముగింపు పలికి, భూమి వైపు దాని ప్రయాణాన్ని పర్యవేక్షిస్తున్నారు.

దక్షిణ భారత్ పరిధిలోకి శకలాల మార్గం

నాసా అంచనాల ప్రకారం.. స్విఫ్ట్ కక్ష్య వంపు కారణంగా దాని శకలాలు భూమధ్యరేఖకు ఉత్తర, దక్షిణ దిశల్లో 20.6 డిగ్రీల అక్షాంశాల మధ్య ఎక్కడైనా పడే అవకాశం ఉంది. ఈ విస్తృత పరిధిలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రాంతం మొత్తం శకలాలు పడే మార్గమని అర్థం కాదు. టెలిస్కోప్ వాతావరణంలోకి ప్రవేశించే సమయం, ఆ సమయంలో దాని స్థానం ఆధారంగా శకలాలు పడే ప్రదేశం మారుతుంది. అందువల్ల నిర్దిష్ట ప్రాంతాన్ని ఇప్పుడే గుర్తించడం సాధ్యం కాదు.

ముప్పు చాలా తక్కువే!

టెలిస్కోప్ బరువు సుమారు 1.5 టన్నులు. వాతావరణంలోకి ప్రవేశించే సమయంలో అధిక భాగం కాలిపోతుందని, కొన్ని భాగాలు మాత్రమే భూమిని చేరే అవకాశం ఉందని నాసా అంచనా వేసింది. భూమిపై ఎవరికైనా హాని కలిగే ప్రమాదం సుమారు 2,100 మందిలో ఒకరికి మాత్రమే ఉంటుందని పేర్కొంది. శకలాలు సముద్రంలో లేదా జనావాసాలు లేని ప్రాంతాల్లో పడే అవకాశమే ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియను నాసా, అమెరికా అంతరిక్ష దళం నిరంతరం పర్యవేక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా అంచనాలను నవీకరిస్తున్నాయి.

రూ.600కే 1,000 కి.మీ. ఈవీ ప్రయాణం!

ముంబై: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రతిపాదన చేశారు. రాత్రి వేళల్లో ఈవీ ఛార్జింగ్‌కు యూనిట్ విద్యుత్ ధరను రూ.3గా, పగటిపూట రూ.5గా నిర్ణయించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రికి సూచించినట్లు వెల్లడించారు. ఈ విధానం అమల్లోకి వస్తే 1,000 కిలోమీటర్ల ప్రయాణానికి ఎలక్ట్రిక్ కారుకు కేవలం రూ.600 మాత్రమే విద్యుత్ ఖర్చవుతుందని వివరించారు. ముంబైలో జరిగిన 'కేపీఎంజీ ఎన్‌రిచ్ 2026' కార్యక్రమంలో ఆయన ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు.

టైమ్ ఆఫ్ డే టారిఫ్ విధానం

పగటిపూట సౌర విద్యుత్ లభ్యతను వినియోగించుకుంటూ, రాత్రి వేళల్లో తక్కువ ధరకు విద్యుత్ అందించడం ద్వారా ఈవీ ఛార్జింగ్‌ను ప్రోత్సహించవచ్చని గడ్కరీ అభిప్రాయపడ్డారు. విద్యుత్ వినియోగాన్ని సమతుల్యం చేయడంతో పాటు వాహనదారులకు నిర్వహణ ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. రాత్రిపూట ఇళ్ల వద్ద లేదా ఛార్జింగ్ కేంద్రాల్లో వాహనాలను తక్కువ ధరకు ఛార్జ్ చేసుకునే అవకాశం కల్పిస్తే పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఈవీల వైపు ప్రజలు మొగ్గు చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఇది ప్రస్తుతం ప్రతిపాదన మాత్రమే. అమలు తేదీ, తుది విద్యుత్ టారిఫ్‌పై ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఒక యూనిట్ విద్యుత్‌తో ఐదు కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం ఉన్న ఎలక్ట్రిక్ కారు 1,000 కిలోమీటర్లకు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుంది. రాత్రిపూట యూనిట్‌కు రూ.3 చొప్పున లెక్కిస్తే మొత్తం ఖర్చు రూ.600 అవుతుంది.

రేవంత్ 'ఈఎంఐ సీఎం'

-మొదటిపేజీ తరువాయి

తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే పదవులు, రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు.

'ఈఎంఐ ముఖ్యమంత్రి'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేయడంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్తున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కంటే తన రాజకీయ భవిష్యత్తు, పదవిని కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డిని 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా అభివర్ణించారు. ప్రియాంక గాంధీ పర్యటన సందర్భంగా ఆమె భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రిని పక్కకు నెట్టినట్లు ఆరోపిస్తూ.. రాష్ట్ర ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీలో దక్కుతున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.

బీజేపీ నేతలపై విమర్శలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనను ప్రస్తావిస్తూ కేటీఆర్ బీజేపీ నేతలపై విమర్శలు చేశారు. అమిత్ షా పర్యటనతో తెలంగాణకు ఏం ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా కీలక విద్యాసంస్థనైనా మంజూరు చేయించారా అని నిలదీశారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ రాష్ట్ర ప్రజల గౌరవాన్ని కాపాడాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అమిత్ షా కాళ్లకు నమస్కరించడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు.



మియాపూర్ భూములు అమ్మొద్దు

హైదరాబాద్‌లోని మియాపూర్ ప్రాంతంలో ఉన్న 550 ఎకరాల ప్రభుత్వ భూములను విక్రయించాలన్న ప్రభుత్వ ఆలోచనను కేటీఆర్ తప్పుబట్టారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే భూముల విక్రయంపై ప్రభుత్వం తొందరపడుతోందని విమర్శించారు. ఆ భూములను అమ్మకుండా తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లు, పాఠశాలలు, కళాశాలలు, పార్కుల నిర్మాణానికి కూడా భూమిని వినియోగించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 250 గజాల స్థలం హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని సవాల్ విసిరారు.

హెచ్ఐఎల్‌టీ విధానంపైనా అభ్యంతరం

హైదరాబాద్‌లోని 21 పారిశ్రామికవాడల్లో దాదాపు 10 వేల ఎకరాల భూములను వాణిజ్య అవసరాలకు మళ్లించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. పరిశ్రమల స్థాపన కోసం రాయితీ ధరలకు కేటాయించిన భూముల్లో పరిశ్రమలు మూతపడితే వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను విక్రయించడం కంటే నగరానికి అవసరమైన పార్కులు, నీటి ట్యాంకులు, బస్ డిపోలు, ఇతర ప్రజా సదుపాయాల కోసం వినియోగించాలని సూచించారు.

రైతులు, సాగునీటిపైనా ఆరోపణలు

రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులపైనా కేటీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను నిర్మించామని గుర్తుచేశారు. గోదావరి, కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గతంలో గణనీయంగా పెంచామని, ప్రస్తుతం సరఫరాలో విశ్వసనీయత కొరవడిందని విమర్శించారు.

బీఆర్ఎస్ నాయకత్వంలోనే రాష్ట్ర ప్రయోజనాలు

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మరోసారి అవకాశం ఇస్తే తెలంగాణ వనరులు, ఆస్తులకు నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవం కాపాడబడతాయని పేర్కొన్నారు.

తెలంగాణ సంస్కృతికి సదర్ కిరీటం!

-మొదటిపేజీ తరువాయి

సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

దున్నరాజుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సదర్ వేడుకలు ఎన్టీఆర్ స్టేడియంలో సందడి నింపాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన దున్నరాజుల ప్రదర్శనలు, వాటి విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సంప్రదాయ వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. యాదవ సమాజ చరిత్ర, పశు సంపద ప్రాధాన్యం, సామాజిక ఐక్యతను చాటేలా కార్యక్రమాలు నిర్వహించారు.

రాష్ట్ర పండుగగా గుర్తింపు

సదర్ సమ్మేళనానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి యాదవ సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించాలనే ఆలోచన చేయలేదని, యాదవుల విజ్ఞప్తి మేరకు తమ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. వేడుకల నిర్వహణకు రూ.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తన చుట్టూ ఎప్పుడూ యాదవ సోదరులు ఉంటారని, వారి సంస్కృతి, సంప్రదాయాలంటే తనకు ఎంతో గౌరవమని అన్నారు. సదర్ వేడుకలకు హాజరయ్యేందుకు మంత్రివర్గ సమావేశాన్ని కూడా వాయిదా వేసుకున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సమాజం పాత్ర ఎంతో కీలకమని ముఖ్యమంత్రి కొనియాడారు. గోల్కొండ కోటకు గతంలో 'గొల్లకొండ' అనే పేరు ఉండేదని గుర్తుచేశారు. కాకతీయుల కాలం నుంచి ఈ ప్రాంత చరిత్రలో యాదవుల పాత్ర ఉందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, విద్య, వ్యాపారాల కోసం హైదరాబాద్‌కు వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. నగరంలో అన్ని ప్రాంతాలు, వర్గాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సోదరభావంతో జీవిస్తున్నారని తెలిపారు.



యాదవులకు సముచిత ప్రాధాన్యం

తమ ప్రభుత్వం యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం కల్పిస్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలిలో నియమించామని గుర్తుచేశారు. రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన నిర్వహించామని, జనాభా ప్రాతిపదికన యాదవులకు దక్కాల్సిన వాటా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పశుసంపదే బలం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి పశుసంపద ఎంతో కీలకమని అన్నారు. పశు సంపద అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని వివరించారు. సదర్ ఉత్సవాల ద్వారా యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి పరిచయం కావడంతోపాటు ఆర్థిక రంగంలోనూ వారు మరింత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

సామాజిక న్యాయం కోసం పోరాడాలి

బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ యాదవ సమాజం దేశవ్యాప్తంగా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించడం ప్రత్యేకమని ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ పేర్కొన్నారు. బలహీన వర్గాల ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

విద్యతోనే అభ్యున్నతి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సదర్ పండుగ హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. యాదవులు సామాజికంగా, విద్యాపరంగా మరింత ఎదగాలని, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకలని అన్నారు. ఎలాంటి సవాళు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడమే సదర్ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సదర్ సమ్మేళనం యాదవుల ఐక్యతకు చిహ్నమని, మహాభారత కాలం నుంచి దేశ చరిత్రలో యాదవుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వేడుకలు ఇతర ప్రాంతాలకు విస్తరించడం సంతోషకరమన్నారు. యాదవులంతా సంఘటితంగా ఉండి సామాజిక, రాజకీయ రంగాల్లో మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ప్రజాప్రతినిధులు, యాదవ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.

బేతుపల్లి చెరువులో కలకలం!

-మొదటిపేజీ తరువాయి

సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు.

మత్స్యకారుల కోసం రెస్క్యూ

బేతుపల్లి పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు వరద ఉధృతికి నీటిలో చిక్కుకుపోయారు. చెరువు అలుగు భారీగా ప్రవహిస్తుండటంతో వారిని బయటకు తీసుకురావడం కష్టంగా మారింది. సమాచారం అందుకున్న అధికారులు అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. తొలుత ముగ్గురు మత్స్యకారులను రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు సమాచారం.

రెండు బోట్లు గల్లంతు

మిగిలిన మత్స్యకారులను రక్షించేందుకు సిబ్బంది రెండు బోట్లలో మరోసారి చెరువులోకి వెళ్లారు. ఈ సమయంలో అలుగు నుంచి వస్తున్న వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో బోట్లు అదుపుతప్పి కొట్టుకుపోయాయి. వాటిలో ఉన్న సిబ్బంది నీటి ప్రవాహంలో చిక్కుకున్నారు. తొలుత 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతైనట్లు పలు వార్తా కథనాలు వెల్లడించాయి. కొన్ని కథనాల్లో ఈ సంఖ్య 10గా పేర్కొనడంతో సిబ్బంది సంఖ్యపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల రంగప్రవేశం

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భద్రాచలం నుంచి జాతీయ విపత్తు స్పందన



దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను రప్పించారు. అదనపు బోట్లు, గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. వరద ప్రవాహం అధికంగా ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. డ్రోన్లు, ఇతర రక్షణ పరికరాల సాయంతో సిబ్బంది ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నాలు చేపట్టారు.

సీఎం రేవంత్ ఆరా

బేతుపల్లి చెరువు ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. సహాయక చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు ఆదేశాలు జారీ చేశారు.

భట్టి విక్రమార్క ఆదేశాలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఘటనపై ఆరా తీశారు. గల్లంతైన సిబ్బంది ఆచూకీ తెలుసుకునేందుకు సహాయక చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అవసరమైన బోట్లు, రక్షణ పరికరాలు, ఇతర సహాయక సామగ్రిని అందుబాటులో ఉంచాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చడమే ప్రాధాన్యంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

పొంగులేటి, తుమ్మల సమీక్ష

మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కూడా ఘటనపై స్పందించారు. జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. గల్లంతైన సిబ్బందిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. సహాయక చర్యల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు ఆదేశించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా అధికారులతో మాట్లాడి ఎన్‌డీఆర్‌ఎఫ్ సహకారం అందేలా చర్యలు చేపట్టారు.

సిబ్బంది ఆచూకీపై ఉత్కంఠ

మత్స్యకారుల ప్రాణాలు కాపాడేందుకు వెళ్లిన రెస్క్యూ సిబ్బందే ప్రమాదంలో చిక్కుకోవడంతో వారి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అందుబాటులోకి వచ్చిన తదుపరి సమాచారం ప్రకారం గల్లంతైన సిబ్బందిని చెరువు సమీపంలో సురక్షితంగా గుర్తించినట్లు, వారిని ఒడ్డుకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఒక వార్తా కథనం పేర్కొంది. అయితే అందరూ సురక్షితంగా ఒడ్డుకు చేరినట్లు అధికారిక నిర్ధారణ అందుబాటులో ల.

పేదల సొంతింటి కలకు మరో అడుగు!

-మొదటిపేజీ తరువాయి

నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పొంగులేటి వెల్లడించారు.

2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు

ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లను కేటాయించగా, ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ఈ ఇళ్లలో దీపావళి సందర్భంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

రూ.22,500 కోట్ల విడుదల

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఆశించిన స్థాయిలో లేకపోయినప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పొంగులేటి పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ పథకం కోసం రూ.22,500 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. మరో లక్షా 90 వేల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందని తెలిపారు.

రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇళ్లను కేటాయించినట్లు మంత్రి వివరించారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

పాత విద్యాసంస్థలకు ఫైర్ ఎన్‌వోసీ ఊరట!

హైదరాబాద్: తెలంగాణలోని పాత పాఠశాలలు, కళాశాలలకు అగ్నిమాపక శాఖ ఊరటనిచ్చింది. ఫైర్ ఆక్యుపెన్సీ ఎన్‌వోసీ జారీకి సంబంధించిన నిబంధనలను సడలిస్తూ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఫైర్ సర్వీసెస్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాత భవనాల్లో అదనపు ఖాళీ స్థలాలు, రెండో మెట్ల ఏర్పాటు వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విద్యాసంస్థలకు కొంత వెసులుబాటు కలగనుంది.

అదనపు స్థలం నిబంధనకు సడలింపు

ఇప్పటికే భవనాల చుట్టూ అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాన్నే పరిగణనలోకి తీసుకోనున్నారు. అదనంగా ఖాళీ స్థలాన్ని ఏర్పాటు చేయాలన్న తప్పనిసరి నిబంధనను సడలించారు. సెట్‌బ్యాక్‌లు తక్కువగా ఉన్న భవనాల్లో ప్రత్యామ్నాయంగా వాటర్ కర్టెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నాలుగు వైపుల నుంచి అగ్నిమాపక నీటిని అందించేలా ఫైర్ బ్రిగేడ్ ఇన్‌లెట్ ఏర్పాటు చేయడం తప్పనిసరి చేశారు.

భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి

భవనం ఎత్తు, నిర్మాణ స్వరూపాన్ని బట్టి అవసరమైన అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయాలి. ల్యాబ్‌లు, సర్వర్ గదుల్లో అవసరాన్ని బట్టి మాడ్యులర్ స్ప్రింక్లర్లు, ఫైర్ అలారాలు, హోస్ రీల్స్, డౌన్‌కమర్లు, నీటి నిల్వ ట్యాంకులు, పంపులు ఏర్పాటు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. మెట్లు, కారిడార్లు, అత్యవసర బయటకు వెళ్లే మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యవసర లైటింగ్, ఎగ్జిట్ సూచికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రెండు నెలల ముందే దరఖాస్తు

అగ్నిప్రమాదాల సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాల భద్రతా కమిటీలు, ఫైర్ సేఫ్టీ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్వీయ ధ్రువీకరణ విధానం యథాతథంగా కొనసాగనుంది. ఫైర్ ఆక్యుపెన్సీ ఎన్‌వోసీ మూడేళ్లపాటు చెల్లుబాటు అవుతుంది. గడువు ముగియడానికి రెండు నెలల ముందుగానే రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఈ నెల 10 నుంచి అమల్లోకి

ఫైర్ సర్వీసెస్ డీజీ ప్రకటించిన కొత్త మార్గదర్శకాలు 2026 నవంబర్ 10 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే ఉన్న విద్యాసంస్థల ఎన్‌వోసీ దరఖాస్తులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని అగ్నిమాపక శాఖ స్పష్టం చేసింది. పాత భవనాల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూనే విద్యార్థులు, సిబ్బంది భద్రతకు అవసరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించింది.

హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్

సమ్మె విరమించిన వాటర్ ట్యాంకర్ల యజమానులు

హైదరాబాద్‌లో నీటి ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించారు. తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరణకు అంగీకరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు ఆ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ నేతృత్వంలో ప్రతినిధులు హైడ్రా కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో వాటర్ ట్యాంకర్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి. కమిషనర్ సూచనల మేరకు సమ్మె విరమణ చేయాలని నిర్ణయించారు. ఔటర్ రింగు రోడ్డు అవతల నుంచి నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు యజమానులు అంగీకరించారు. దీంతో గత రెండు రోజులుగా సాగుతున్న సమ్మె ముగిసినట్లైంది. తక్షణమే నీటి ట్యాంకర్ల సరఫరాలు పునరుద్ధరించాలని నిర్ణయించింది. సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన అనంతరం ావతీఱ ఖతీఝఱ =వస్త్రఱశీఱ – ాఖ=జు ప్రాంతం నుంచే బోరు నీటిని సేకరించి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు సంఘం సభ్యులు అంగీకరించారు. ఇకపై తమ ట్యాంకర్ వ్యాపార కార్యకలాపాలన్నీ ాఖ=జు ప్రాంతం నుంచే నిర్వహిస్తామని వాటర్ ట్యాంకర్ల యజమానులు తెలిపారు.

బోర్ల నుంచి నీరు సేకరణ

హైదరాబాద్ నగరం అత్యంత జనసాంద్రత కలిగిన ప్రాంతం కావడంతోపాటు ఎల్‌నినో ప్రభావం, తగినంత వర్షపాతం లేకపోవడం వంటి కారణాలతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి. ఈ పరిస్థితుల్లో నగరంలోని జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాణిజ్య అవసరాల కోసం పెద్ద ఎత్తున భూగర్భ జలాలు తోడటం వల్ల స్థానిక నివాసితుల గృహ అవసరాలకు వినియోగించే బోర్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, అమీర్‌పేట, అశోక్‌నగర్ వంటి ప్రాంతాల్లో నీటికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ట్యాంకర్ల నిర్వాహకులు రవాణా దూరం, ఇంధన ఖర్చులు తగ్గించుకునేందుకు ఆయా ప్రాంతాలకు సమీపంలోని బోర్ల నుంచి నీటిని సేకరిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది.

భూగర్భ జలాలపై మరింత ప్రభావం

సాధారణంగా గృహ అవసరాల కోసం వేసే బోర్లు 100 నుంచి 300 అడుగుల లోతు వరకు ఉంటుండగా, వాణిజ్య అవసరాల కోసం కొందరు 1,000 నుంచి 1,500 అడుగులు లేదా అంతకంటే ఎక్కువ లోతులో బోర్లు వేసి అధిక సామర్థ్యం కలిగిన మోటార్లతో నీటిని తోడుతున్నారు. ఫలితంగా భూగర్భ జలాలపై మరింత ప్రభావం పడుతోందని నీటి ట్యాంకర్ల యజమానులు వివరించారు. నగరంలో జనసాంద్రత అధికంగా ఉన్న నీటి డిమాండ్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెద్ద ఎత్తున వాణిజ్య అవసరాలకు వినియోగించకుండా నియంత్రించేందుకు వాటర్ బోర్డు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖలతో కలిసి హైడ్రా సమన్వయంతో పని చేసిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు.

ఆ బోర్లను గుర్తించి తొలగించే చర్యలు

హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో స్థానికుల నిరసనలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఈ సమస్యపై పలు కాలనీల సంక్షేమ సంఘాలు, ప్రజల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. తెల్లాపూర్ ప్రాంతంలో వాణిజ్య అవసరాల కోసం నీరు తోడటాన్ని నిలిపివేయాలని రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. సూరారం, జీడిమెట్ల ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లలోని బోర్లలో నీరు అడుగంటిపోతోందని హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, భూగర్భ జలాల శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టింది. చెరువుల నుంచి వాణిజ్య అవసరాల కోసం నీటిని తోడుతున్న బోర్లను గుర్తించి తొలగించే చర్యలు కూడా చేపట్టింది. అదే సమయంలో వాణిజ్య సంస్థలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటూ, ప్రజల గృహ అవసరాలకు నీటి లభ్యతను కాపాడేందుకు కృషి చేయనుందని రంగనాథ్ భరోసా ఇచ్చారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
5 నవంబర్ 2026

వర్షానికి గుంతలమయమైన ప్రధాన రహదారి

పిల్లలు, వృద్ధులకు నరకయాతన - పట్టించుకోని అధికారులు

వైరా, నవంబర్ 4 (నవగీతం):వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సోమవరం గ్రామం ఎస్సీ కాలనీ (మాలపల్లి)కి వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం పూర్తిగా అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్డు బురదమయమై, కాలనీ వాసులకు నరకయాతనగా మారింది.


రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు:

వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి, కాలనీకి వెళ్లే మార్గం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితికి చేరింది. రోడ్డు అంతా గుంతలమయమై బురద పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాహనాలు బురదలో కూరుకుపోయి, ప్రజలు దారిలోనే చిక్కుకుపోతున్నారు.దీంతో ఆ మార్గంలో ప్రయాణించే కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలకు తీవ్ర విఘాతం కలగడమే కాకుండా, రాత్రివేళల్లో నడవడానికి నరకయాతన అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు.

ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. బురదలో జారిపడి గాయాలపాలవుతున్నారు. స్కూల్ కి వెళ్లే పిల్లలు బురద అంటుకున్న బట్టలతో వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర వేళ అంబులెన్స్ కూడా రాదు:

అత్యవసర సమయంలో అంబులెన్స్ లేదా ఇతర వాహనాలు కాలనీకి వచ్చే పరిస్థితి లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే ఆసుపత్రికి తీసుకెళ్లడం కూడా కష్టంగా మారిందని చెబుతున్నారు.



అనేక ఏళ్లుగా ఈ సమస్య పునరావృతమవుతున్నా, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పట్టించుకోకపోవడంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, ఆ తర్వాత మరిచిపోతున్నారని మండిపడుతున్నారు.ఎఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే తాత్కాలికంగా గ్రావెల్ తోలి రాకపోకలను పునరుద్ధరించాలని, అలాగే రోడ్డుకు శాశ్వత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి తమ రవాణా కష్టాలను తీర్చాలని 11వ వార్డు ఎస్సీ కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఇంట శుభకార్యం - నిశ్చితార్థానికి సీఎం, డిప్యూటీ సీఎంలకు ఆహ్వానం

వైరా, నవంబర్ 4 (నవగీతం): వైరా నియోజకవర్గంలో శుభకార్య వాతావరణం నెలకొంది. వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ కుటుంబంలో ఈ నెల 6వ తేదీన జరగనున్న శుభకార్యానికి రాష్ట్రంలోని అగ్రనేతలందరికీ ఆహ్వానాలు అందుతున్నాయి. తన పెద్ద కుమార్తె గాయత్రి నిశ్చితార్థ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే కుటుంబం సన్నాహాలు చేస్తోంది. ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు దంపతులను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వారి సతీమణి నందినిని ప్రత్యేకంగా కలిశారు. వారికి నిశ్చితార్థ వేడుక ఆహ్వాన పత్రికను అందజేసి, వేడుకకు తప్పకుండా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దంపతులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి, వేడుకకు హాజరయ్యేందుకు



ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

తన కుటుంబంలో జరగనున్న ఈ శుభకార్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దంపతులను ఆహ్వానించడం పట్ల ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. “నా కుమార్తె నిశ్చితార్థం నా కుటుంబానికే కాదు, వైరా నియోజకవర్గ ప్రజలందరికీ ఒక పండుగ లాంటిది. పెద్దల



ఆశీర్వాదంతో ఈ వేడుక ఘనంగా జరగాలని కోరుకుంటున్నాను” అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నెల 6వ తేదీన జరగనున్న గాయత్రి నిశ్చితార్థ వేడుకకు వైరా నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకానున్నారు.

మురసు బీభత్సం.. నేలకొరిగిన వరి..

ఆక్వాన్ భయంతో వణుకుతున్న రైతన్నలు
ఒక్క రాత్రిలో రైతుల ఆశలు గల్లంతు

వైరా,నవంబర్ 4 (నవగీతం):వైరా మండలం పుణ్యపురం గ్రామంలో రైతుల కళ్ళలో కన్నీరు ఆగడం లేదు. ఆరు నెలలుగా కష్టపడి, అప్పులు చేసి పండించిన వరి పంట ఒక్క రాత్రిలోనే నాశనమైంది. కోతకు వచ్చి చేతికి అందుతుందనుకున్న సమయంలో వచ్చిన గాలివాన రైతుల ఆశలను చిదిమేసింది.

ఒక్క రాత్రిలో జరిగిన బీభత్సం:

సోమవారం రాత్రి నుంచి మొదలైన వర్షం మంగళవారం రాత్రికి మరింత ఉధృతమైంది. మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి తోడు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులకు గ్రామంలో 100 వరి పొలాలు పంట నేలకొరిగాయి.

గ్రామ శివారులో ఉన్న పొలాల్లో వరి మొత్తం నేలమట్టమై నీటిలో మునిగిపోయింది. కొన్ని చోట్ల వరి కంకులు నీటిలో కొట్టుకుపోయాయి. మరికొన్ని చోట్ల పంట మొత్తం బురదలో కలిసిపోయింది. కోత కోసినా గింజ రాలిపోయి, తాలు మాత్రమే మిగిలే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

రైతుల ఆవేదన:

“ఎకరాకు 35 వేల నుంచి 40 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టాం అన్నా. విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల కోసం అప్పు చేశాం. పంట చేతికి వస్తే అప్పులు తీర్చుకోవచ్చని ఆశపడ్డాం. ఇప్పుడు పంట మొత్తం పోయింది. ఇంట్లో పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు ఎలా గడపాలో



అర్థం కావడం లేదు” అని పుణ్యపురం గ్రామానికి చెందిన ఓ రైతు కన్నీటి పర్యంతమయ్యారు.

మరో రైతు మాట్లాడుతూ... “కోతకు రెండు రోజులు మాత్రమే ఉంది. కోత మిషన్ కూడా మాట్లాడుకున్నాం. ఇంతలో ఈ గాలివాన వచ్చి మొత్తం పడగొట్టింది. ఇప్పుడు కోత కోసినా కూలీలు కూడా రావడం లేదు” అని ఆవేదన వ్యక్తం చేశారు.

15వ తారీకు ఆక్వాన్ తుఫాన్ – మరింత భయం:

ఇప్పటికే నష్టపోయిన రైతులను మరో వార్త మరింత భయపెడుతోంది. ఈ నెల 15వ తారీకున ఆక్వాన్ తుఫాన్ వస్తుందని వాతావరణ శాఖ అంచనా లేకపోవడంతో గ్రామంలో ఆందోళన మొదలైంది.

తుఫాన్ ఏ దిశగా వస్తుంది? వైరా వైపు మళ్లుతుందా? లేక దిశ మార్చుకుని వేరే వైపు వెళ్తుందా? అని రైతులు ప్రతి రోజూ వాతావరణ వార్తల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకవేళ మళ్ళీ వర్షం పడితే మిగిలిన పంట కూడా పూర్తిగా పోతుందని వారు భయపడుతున్నారు.

పంట నష్టపోయిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి, ప్రతి పొలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంట బీమా, ప్రభుత్వ పరిహారం వెంటనే అందేలా చూడాలని, కోతకు వచ్చిన పంటను త్వరగా కొనుగోలు కేంద్రాల్లో కొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గాయంతో విశ్రాంతిలో ఉన్న లక్ష్మణ్ బాబు

పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ శ్రేణులు

వెంకటాపురం, నూగూరు, నవంబర్ 4 (నవగీతం): ప్రమాదంలో కాలుకు గాయమై ఇంటికే పరిమితమైన ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు లక్ష్మణ్ బాబును చూసేందుకు బుధవారం వెంకటాపురం నుండి బీఆర్ఎస్ నాయకులు తరలివచ్చారు. గుడవర్తి నరసింహమూర్తి నేతృత్వంలో నాయకులు ఆయన ఇంటికి వెళ్లారు. చాలాసేపు ఆయనతో మాట్లాడారు. గాయం ఎలా ఉంది? డాక్టర్లు ఏం చెప్పారు? మందులు ఎలా వాడుతున్నారు? అని ఒక్కొక్కటీ అడిగి తెలుసుకున్నారు. త్వరగా లేచి తిరిగి మా మధ్యకు రావాలని మనస్ఫూర్తిగా కోరారు. ఆయన లేకపోవడం జిల్లా పార్టీకి లోటుగా ఉందని నాయకులు అన్నారు. వెంకటాపురం (నూగూరు) బీఆర్ఎస్ అధ్యక్షులు గంప రాంబాబు మాట్లాడుతూ – “లక్ష్మణ్ బాబు గారు లేకుండా జిల్లాలో పార్టీ కార్యక్రమం అంటేనే ఏదో వెలితిగా ఉంది. కార్యకర్త అంటే ఆయనకు ప్రాణం. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండే మనిషి” అని అన్నారు. గాయం అయినా సరే ఆయన మనసు మాత్రం పార్టీ మీదే ఉందని, రోజూ ఫోన్ చేసి కార్యకర్తలను పలకరిస్తున్నారని చెప్పారు. అలాంటి నాయకుడు త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నామని అన్నారు. “ఆయన నాయకత్వంలోనే జిల్లాలో బీఆర్ఎస్ మళ్ళీ పూర్వ వైభవం తెచ్చుకుంటుంది. ఆయన తిరిగి వస్తే కార్యకర్తల్లో జోష్ రెట్టింపు అవుతుంది” అని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ పరామర్శలో ముడుంబా శ్రీనివాస్, మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేందర్, కుషం దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల,నవంబర్04,(నవగీతం) జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి మరియు తొంబారావుపేట్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, భూ రికార్డుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను చేపట్టాలని, భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, మేడిపల్లి మండల తహసీల్దార్ , సంబంధిత అధికారులు మరియు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీరు..వాహనదారులకు ఇబ్బందులు!



మల్లాపూర్, నవంబర్ 4 (నవగీతం): మల్లాపూర్ మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై వరద నీరు చేరింది. మండల కేంద్రంలోని నంది విగ్రహంవద్ద రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వర్షంకురిసిన ప్రతిసారి నీరు బయటికి వెళ్లిపోవడానికి మార్గంలేక రోడ్డుపైనే నిలున్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారువర్షపునీరు పక్కన ఉన్న డ్రైనేజీలోకి వెళ్లేలా చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్తులు, వాహనదారులు కోరారు.

అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన.



ఇల్లంతకుంట, నవంబర్ 4 (నవగీతం) మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ సుందరీకరణ, చెక్‌డ్యామ్ నిర్మాణం, అలాగే దోబీ ఘాట్ వద్ద రైతులకు రాకపోకల్లో ఇబ్బంది లేకుండా కల్వర్టు నిర్మాణ పనుల కోసం బుధవారం సర్పంచ్ యం రాజు సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బతుకమ్మ ఘాట్ పరిసరాలను పరిశీలించి సుందరీకరణ పనులపై చర్చించారు. అదేవిధంగా చెక్‌డ్యామ్, దోబీ ఘాట్ వద్ద కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గ్రామ ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏ ఈ దిలీప్ , పంచాయతీ రాజ్ ఏ ఈ రాజేష్ , వార్డు సభ్యులు రాకం సుమన్ , ఫీల్డ్ అసిస్టెంట్ వేణు , గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌నినో పై అప్రమత్తంగా ఉండాలి.



ఇల్లంతకుంట, నవంబర్ 4 (నవగీతం): మండలంలోని పెద్ద లింగాపూర్ , తాళ్లపల్లి గ్రామాలలో వేరువేరు సభలు నిర్వహించారు.,ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగి సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ సురేష్, సూచించారు. సోమవారం పెద్ద లింగాపూర్, గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరికి బదులుగా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు వివరించారు. అలాగే కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రీయ ఎరువులు వాడడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వరిలో పంట అవశేషాలను కాల్చవద్దని, వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రీయ కర్బనం పెరుగుతుందని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయాలని, నీటి వసతులు లేని చోట క్రాప్ హాలిడే పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రామకృష్ణ, , వ్యవసాయ అధికారి , విద్యుత్ శాఖ, ఇరిగేషన్ శాఖ, ఉద్యానవన శాఖ, మిషన్ భగీరథ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారి అర్చన, గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి రచన వెంకట్రామ్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎలుక రామస్వామి, కార్యదర్శి తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
5 నవంబర్ 2026

4,130 మీటర్ల ఎత్తులో మూడు పతాకాల ఆవిష్కరణ

అన్నపూర్ణ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన న్యాయవాది ఎర్ర రమేష్

మల్లాపూర్, నవంబర్4,(నవగీతం): నేపాల్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో అత్యంత క్లిష్టమైన ట్రెక్కింగ్ మార్గంగా పేరొందిన అన్నపూర్ణ బేస్ క్యాంప్ యాత్రను ఓబులాపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది ఎర్ర రమేష్ విజయవంతంగా పూర్తి చేశారు. సముద్ర మట్టానికి 4,130 మీటర్ల ఎత్తులో ఉన్న అన్నపూర్ణ బేస్ క్యాంప్‌కు చేరుకుని భారత జాతీయ జెండా, జై భీమ్ జెండా, పంచశీల పతాకాలను ఆవిష్కరించడం విశేషం. జీను నుంచి ప్రారంభమైన ఆయన సాహసయాత్రలో సస్పెన్షన్ బ్రిడ్జిలు, లోతైన లోయలు, హిమాలయ నదులు, నిటారుగా ఉండే కొండ మార్గాలు, వందలాది మెట్లను దాటుకుంటూ ముందుకు సాగారు. చోమ్రూంగ్, లోయర్ సినువా, అప్పర్ సినువా, బాంబూ, దోవాన్, హిమాలయ, దేయురాలి, మచ్ఛపుచ్ఛే బేస్ క్యాంప్ మీదుగా అన్నపూర్ణ బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. సుమారు రెండు రోజులు మూడు గంటల వ్యవధిలో ఈ సాహసయాత్రను పూర్తి చేశారు.ట్రెక్కింగ్ సమయంలో మైనస్ 5 డిగ్రీల వరకు పడిపోయిన ఉష్ణోగ్రతలు, ఆక్సిజన్ స్థాయిల తగ్గుదల, తీవ్రమైన చలి, అలసట, కండరాల నొప్పులు వంటి అనేక సవాళ్లు ఎదురైనా పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్నారు. అన్నపూర్ణ బేస్ క్యాంప్‌కు చేరుకున్న అనంతరం భారతదేశ గౌరవానికి ప్రతీకగా జాతీయ జెండాను, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, సామాజిక సమానత్వం, స్వేచ్ఛ, సమాన హక్కులకు ప్రతీకగా జై భీమ్ జెండాను, గౌతమ బుద్ధుని శాంతి, కరుణ, ప్రజ్ఞ, మానవతా సందేశానికి ప్రతీకగా పంచశీల పతాకాన్ని ఆవిష్కరించారు.



విజయవంతంగా పూర్తి చేసి మూడు పతాకాలను ఆవిష్కరించిన ఎర్ర రమేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.

హిమాలయ పర్వత సానువులపై మూడు పతాకాలను ఆవిష్కరించడం తన జీవితంలో మరచిపోలేని అనుభూతి అని ఎర్ర రమేష్ తెలిపారు. భారతదేశ గౌరవాన్ని, అంబేద్కర్ ఆశయాలను, బుద్ధుని మానవతా మార్గాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన హిమాలయ ట్రెక్కింగ్‌ను

100 శాతం హాజరు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

మల్లాపూర్,నవంబర్4,(నవగీతం) మల్లాపూర్ మండలం వెంకిలిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెలలో 100 శాతం హాజరు నమోదు చేసిన విద్యార్థినీ విద్యార్థులను మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు రాజేందర్, నుమిత్రాదేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖ నవంబర్ 2026 నెలను 100 శాతం విద్యార్థుల హాజరు నమోదు మానంగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులందరూ ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ



తీసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 100 శాతం హాజరు నమోదు లక్ష్యాన్ని సాధించే దిశగా సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మండలంలోని ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

అమెరికా మధ్యంతర ఎన్నికలు

ఫ్లోరిడా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లలో కాంగ్రెస్‌పై ఎవరికి పట్టు ఉంటుందో తేల్చే మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని 37 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు కూడా ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కీలక పదవుల కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ నేత సుహాస్ సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు. వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసిన ఆయన, 61 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెక్‌విత్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గతంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్‌లో టెక్నాలజీ పాలసీ సలహాదారుగా సుహాస్ పనిచేశారు. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఒహాయో గవర్నర్ పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ప్రస్తుతం వెనుకంజలో ఉన్నారు. కేరళ మూలాలున్న వివేక్‌కు అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ అభ్యర్థి అమీ యాక్టన్ కంటే దాదాపు 2,00,000 ఓట్ల వెనుకంజలో ఉన్నారు. మరోవైపు ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పియా దండియా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ అయిన ఆమె, రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌పై దాదాపు 11,000 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. సిలికాన్ వ్యాలీలోని కొన్ని



ప్రాంతాలున్న కాలిఫోర్నియా 17వ డిస్ట్రిక్ట్‌లో ఇద్దరు భారత సంతతి నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇక్కడ డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నాపై రిపబ్లికన్ నేత రితేష్ టాండన్ పోటీ చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్‌లోని 7వ డిస్ట్రిక్ట్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్‌పై మరో భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేత నీరవ్ సేథ్ బరిలో ఉన్నారు. ఈ రెండు చోట్లా ఫలితాలు ఇంకా వెలువడలేదు. వీరితో పాటు సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యుడు అమీ బేరా (కాలిఫోర్నియా), అమిష్ షా (అరిజోనా), పూజా సేథి (టెక్సాస్), సందీప్ శ్రీవాస్తవ (టెక్సాస్) వంటి అనేకమంది భారత సంతతి అభ్యర్థులు వివిధ స్థానాల నుంచి పోటీ పడుతున్నారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ పదవికి నిత్యా రామన్ పోటీ చేస్తున్నారు. ఆమె గెలిస్తే, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలైన న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌కు భారత సంతతికి చెందినవారే మేయర్లుగా ఉంటారు. కొన్ని చోట్ల ఫలితాలు వెలువడినప్పటికీ, పలువురు కీలక భారత సంతతి అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మెహిదీపట్నం హోటల్లో అగ్నిప్రమాదం

హైదరాబాద్ : మెహిదీపట్నం కింగ్స్ రెస్టారెంట్లో రాత్రి 11:40 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. నూడుల్స్ తయారుచేసే ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారు. లంగర్ హౌస్, అంబర్‌పేట నుంచి ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లు చేరుకున్నాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో ఘటన జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు.

నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరు

కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ

హైదరాబాద్ : అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో ట్రంప్ ఓటమితో ప్రపంచానికి మేలు జరుగుతుంది. యుద్ధ పిపాసులుగా ఉండే నేతలకు ఓటమే ఎదురవుతుందని ప్రజాశాంతి పార్టీ అధినేత కెఏ పాల్ అన్నారు. ఇజ్రాయెల్లో నెతన్యాహూ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇరాన్ యుద్ధం ఆపకపోతే మాజీ స్పీకర్గా మారతావు అంటూ స్పీకర్ మైక్ జాన్సన్ను హెచ్చరించాను. కళ్లు నెత్తికెక్కిన రాజకీయ నేతలు ఎవరికైనా ఇదే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. నేటి ప్రపంచంలో ట్రంప్ కంటే పవర్ఫుల్ నేత ఎవరూ లేరు. ఎన్ని బెదిరింపు కాల్స్ వచ్చినా నేను ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ వచ్చాను. ఇది మన దేశంలో ముఖ్యమంత్రులు, నేతలకు కూడా హెచ్చరికే. మతం పేరుతో గొడవలు పెట్టేవారికి ఇదే నా హెచ్చరిక. బైబిల్ పంచినందుకు మహిళలపై దాడి చేస్తే.. వారిని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదు. నేను భారత్ కి తిరిగి వస్తా ఒక్కొక్కరి తాట తీస్తా. నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి..

కుటుంబానికి అండగా ప్రభుత్వం

హైదరాబాద్: భద్రాద్రిలో బస్సులో చిల్లర విషయంలో జరిగిన గొడవలో ప్రయాణికురాలు తోసేయడంతో తీవ్రంగా గాయపడిన కండక్టర్ ప్రవళిక చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు.
హైదరాబాద్ లోని సాయి సంజీవని ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించినా కాపాడుకోలేకపోయామని తెలిపారు. ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు, రూ. 10 లక్షల

ప్రమాదవశాత్తు మహిళ మృతి.. మల్లాపూర్ లో విషాదం



మల్లాపూర్, నవంబర్ 4 (నవగీతం): మల్లాపూర్ గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు మోరిలో జారిపడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన చిప్ప నడిపి లక్ష్మి (58), భర్త లక్ష్మణ్‌తో కలిసి నివసిస్తూ బీడీలు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 3వ తేదీ సాయంత్రం బట్టలు కొనుగోలు చేసేందుకు గ్రామంలోని స్వప్న సెలక్షన్స్‌కు వెళ్తున్నానని భర్తకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినప్పటికీ ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో గ్రామానికి చెందిన గొట్టి పడత స్వామి తన ఇంటి ముందు ఉన్న మోరిలో లక్ష్మి పడిపోయి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఆమెను మోరిలో నుంచి బయటకు తీసి చూడగా, తల వెనుక భాగంలో తీవ్ర రక్తగాయంతో పాటు శరీరంలోని ఇతర భాగాల్లోనూ గాయాలు కనిపించాయి. వెంటనే చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు ప్రమాదవశాత్తు మోరిలో జారిపడి మృతి చెందినట్లు ప్రాథమికంగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త చిప్ప లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు మల్లాపూర్ ఎస్సై అనిల్ కుమార్ వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కమ్యూనిటీ సోక్ పిట్స్‌కు ముగ్గు పోసిన సర్పంచ్



మల్లాపూర్, నవంబర్4,(నవగీతం) పరిసరాల పరిశుభ్రత, మురుగునీటి నిర్వహణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య పిలుపునిచ్చారు. గుండంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణల్లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ సోక్ పిట్స్ (ఇంగుడు గుంతల) పనులకు ఆమె లాంఛనంగా ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పాఠశాలల ప్రాంగణాల్లో నీరు నిల్వ ఉండకుండా, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ఈ సోక్ పిట్స్ ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మురుగునీటి సమస్య పరిష్కారంతో పాటు భూగర్భ జలాల పెంపునకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర ప్రకాష్, మండల పరిషత్ ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాలల ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, రాజేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ల్యాప్‌టాప్ కోసం రూ.40 వేల ఆర్థిక సహాయం

తల్లాడ, వైరా లయన్స్ క్లబ్‌ల సంయుక్త సేవా కార్యక్రమం



వైరా, నవంబర్ 4(నవగీతం): తండ్రిని కోల్పోయి, తల్లి కూలీ పనులతో జీవనం సాగిస్తున్న నిరుపేద విద్యార్థికి ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం తల్లాడ మండలం బాలప్పపేట గ్రామానికి చెందిన ఉమా రేణుకకు తల్లాడ, వైరా లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా రూ.40 వేల ఆర్థిక సహాయం అందించాయి.తల్లాడ లయన్స్ క్లబ్ సభ్యుల విజ్ఞప్తి మేరకు లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ చొరవతో రెండు క్లబ్‌ల తరఫున చెరో రూ.20 వేలు సమకూర్చారు. వైరాకు చెందినవిశ్రాంతఉపాధ్యాయురాలు లయన్ ఇంద్రాణి, కీర్తిశేషులు లయన్ పు తుంశీబాక కృష్ణమూర్తి 9వ వర్ధంతి సందర్భంగా విరాళం అందించగా, తల్లాడకు చెందిన లయన్ కర్నాటి లక్ష్మారెడ్డి సహకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల ఉన్నత చదువులకు అడ్డంకి కాకూడదని, విద్యాదానమే గొప్ప సేవ అని పేర్కొన్నారు. దాతలు ఇంద్రాణి, లక్ష్మారెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. పు తుంబాక కృష్ణమూర్తి సేవలను గుర్తు చేసుకున్నారుఈ కార్యక్రమంలో లయన్ లగడపాటి ప్రభాకర్, ఉంద్రు శ్యాంబాబు, పెనుగొండ ఉపేంద్ర రావు, చింతోజు నాగేశ్వరరావు, సీత, అనుమాయమ్మ, చిట్టెం నరసింహారావు, కటిక వెంకటేశ్వర్లు శీలం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురసు తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో భారీ వర్షాలు

చిలకలూరిపేటలో జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు

విజయవాడలో 10 గంటలుగా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని ప్రజల్లో భయాందోళనలు

చిలకలూరిపేట : పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు మరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమ య్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. గత అనుభవాల నేపథ్యంలో, బుడమేరు వాగుకు మళ్లీ వరద

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
5 నవంబర్ 2026

దిగొస్తున్న కూరగాయల ధరలు



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. వంటిల్లో రోజూ ఉపయోగించే టమాటా, ఉల్లిపాయలు ధరలు అదుపులో ఉన్నాయి. మొన్నటివరకు వీటి ధరలు భగ్గుమనగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ సీజన్ క్రమంలో ధరలు చౌకకే దొరకడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఇటీవల ధరలు పెరిగాయి. కూరగాయలకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు పంట మార్కెట్‌కు వస్తుండటంతో సరఫరా పెరిగింది. ఈ కారణంతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో ఈ పరిణామం పండుగ వేళ సామాన్యుల ఇంటి బడ్జెట్‌ను తగ్గిస్తోంది. పండుగ సమయాల్లో ఇంట్లో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇక రకరకాల వంటలు వడేందుకు కూరగాయల అవసరం ఎక్కువగా ఉంటుంది. ధరలు తగ్గడం పండక్కి ముందే ఊరటగా కల్గిస్తోంది.కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లోని నవంబర్ 3వ తేదీన కిలో టమాట రూ. 29, వంకాయ రూ. 18, బెండకాయ రూ. 45, పచ్చిమిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 13, బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 43, గోబీవువ్వు రూ. 25, దొండకాయ రూ. 23, చిక్కుడుకాయ రూ. 45, గోరుచిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 19కు విక్రయిస్తున్నారు. ఇఖ క్యాప్సికమ్ రూ. 45, బంగాళాదుంప రూ. 19, కీర (లోకల్) రూ. 23, కీర (ఇటాలియన్) రూ. 35, దోసకాయ రూ. 18, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 22 పలుకుతున్నాయి. అలాగే కిలో కంద రూ. 35, ఉల్లికాడలు రూ. 55, ఉల్లిగడ్డ రూ. 40, పచ్చి మామిడికాయ ఒక్కొక్కటి రూ. 15-20, అరటికాయ ఒక్కొక్కటి రూ. 9-10, చామగడ్డ రూ. 35, ముల్లంగి ఒక్కొక్కటి రూ. 6-8, చిలగడదుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 25, నిమ్మకాయలు డజను రూ. 50-60కు లభిస్తున్నాయి. అలాగే మునగకాయలు ఒక్కొక్కటి రూ. 8-10, బొప్పాయి రూ. 50, పుట్టగొడుగులు (200 గ్రా.) రూ. 50, ఎండుమిర్చి రూ. 280, పాత అల్లం రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 45, కరివేపాకు రూ. 80, పర్వల్ రూ. 28, పల్లికాయ రూ. 55, లోబియా రూ. 28, ఆగారకరకాయ కిలో రూ. 85గా ఉన్నాయి.విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.39, బెండ రూ.24, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.34, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.25, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.32, దోస రూ.20, చామదుంప రూ.34, అల్లం రూ.76, కంద రూ.34, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.46, బీన్స్ రూ.105, క్యాప్సికం రూ.60, చింతకాయలు రూ.100 పలుకుతున్నాయి

షాద్ నగర్ నియోజకవర్గానికి డీకే అరుణ చేసింది ఏమిటి..?

షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ నిలదీత

ఎంపీ లేఖలు ఎక్కడ?.. ప్రొసీడింగ్స్ చూపగలరా?

ఫొటోల రాజకీయం తప్ప షాద్‌నగర్‌కు ఎంపీ అరుణ సాధించింది శూన్యం

షాద్‌నగర్ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు



షాద్‌నగర్ : పట్టణంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఘనత తమదేనంటూ బీజేపీ నాయకులు ఎంపీ డీకే అరుణకు కృతజ్ఞతలు చెప్పడం కేవలం ప్రచారార్భాటమేనని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అసలు ఈ ప్రాజెక్టు కోసం ఎంపీగా డీకే అరుణ అధికారికంగా చేసిన కృషి ఏంటో, ఎవరికి ప్రతిపాదనలు పంపారో, ఏ తేదీల్లో లేఖలు రాశారో ప్రజల ముందు ఆధారాలతో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిగా అధికారిక యంత్రాంగం ద్వారా చట్టబద్ధంగా జరుగుతోందని స్పష్టం చేశారు. భూసేకరణ కోసం ఆర్డీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు అధికారిక లేఖలు వెళ్లాయని, ఆపై కలెక్టర్ ద్వారా ఐడపీఆర్ (ఎడఖఖీ) కమిషనర్‌కు సమాచారం అందిందని తేదీలతో సహా సంబంధిత ప్రొసీడింగ్స్ పత్రాలను ఆయన మీడియాకు చూపించారు. ఈ క్రమంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం జరిగేలా, వారికి ఎంత పరిహారం (కాంపెన్సేషన్) అందించాలన్న విషయమై ఆర్డీవో కార్యాలయం ఆధ్వర్యంలో బాధితులతో ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో, ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా రైల్వే విభాగమే స్వయంగా 100 శాతం నిధులతో ఈ నిర్మాణాన్ని పూర్తిచేయాలని నిర్ణయించిందని బాబర్ వెల్లడించారు. గతంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే శంకరయ్య వంటి నాయకులు సమస్య తీవ్రతను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. అయితే, స్థానిక ఎంపీగా ఉన్న డీకే అరుణ మాత్రం షాద్‌నగర్ నియోజకవర్గానికి ప్రత్యక్షంగా తెచ్చిన నిధులు ఏమున్నాయో చెప్పాలని నిలదీశారు. ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలను, కేంద్ర మంత్రులను కలిసి మర్యాదపూర్వకంగా శాలువాలు కప్పడం, ఫొటోలు దిగడం తప్ప నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఆమె చేసిందేమీ లేదని మండిపడ్డారు. ప్రచార పిచ్చితో సంబంధం లేని పనులకు క్రెడిట్ కొట్టేయాలని చూడటం బీజేపీ నాయకులకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంది తిరుపతి రెడ్డి, మహబూబ్, రమేష్, చంద్రశేఖర్ గౌడ్, చందం నరసింహులు, జంగయ్యలతో పాటు డిప్యూటీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

నీలా మోసాలు చేయడం మా ఎమ్మెల్యేకు చేతకాదు

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

షాద్ నగర్ కాంగ్రెస్ నేత రఘు నాయక్ హెచ్చరిక

షాద్‌నగర్ అభివృద్ధిని చూసి ఓర్వలేకే విష్ణువర్ధన్ రెడ్డి అసత్య ప్రచారాలు

ప్రజా సంక్షేమం కోసం పని చేసే ఎమ్మెల్యేపై చవకబారు విమర్శలా?

విష్ణువర్ధన్ రెడ్డి వ్యాఖ్యలకు గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ ఆగ్రహం

పాలమూరు సొంత రాజకీయ కుంపటి తప్ప మరొకటి కాదు

జూనియర్ కేఏ పాల్ చేతలు మానుకో..!



షాద్ నగర్ : నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తున్న స్థానిక శాసనసభ్యుడిపై షాద్ నగర్ జూనియర్ కేఏ పాల్ గా పేరు గాంచిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి నిరాధారమైన, చవకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల స్థానిక నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేను ఉద్దేశించి చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేకు పనులు చేయడం చేతకాదని, పరిపాలనపై అవగాహన లేదంటూ మాట్లాడటం విష్ణువర్ధన్ రెడ్డి అజ్ఞానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే అభివృద్ధిని విస్మరించి వ్యక్తిగత విమర్శలు, బెదిరింపు ధోరణికి దిగితే ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.అభివృద్ధి పనుల ప్రగతిని చూడండిఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో నిధులు మంజూరై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని రఘు నాయక్ పేర్కొన్నారు. ప్రజల రాకపోకలు, దర్గా మార్గ ప్రయాణికుల సౌకర్యార్థం వై-జంక్షన్ విస్తరణ, ఆర్ అండ్ బి రహదారి పనుల కోసం పార్టీలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి మంజూరు చేయించారని వెల్లడించారు.విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జూనియర్ కళాశాల ఆధునికీకరణ కోసం దాదాపు రూ.15 కోట్లు సమీకరించడం జరిగిందన్నారు. కొందుర్గు ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాజెక్టు కింద సుమారు రూ.250 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామంలో అత్యాధునిక 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఏర్పాటుకు నిధులు సాధించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని స్పష్టం చేశారు. 'కామ్రేడ్' పదం వాడే అర్హత నీకు ఉందా?'ఖబర్దార్ కామ్రేడ్' అంటూ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరికలు జారీ చేయడాన్ని రఘు నాయక్ ఎద్దేవా చేశారు. "కామ్రేడ్ అంటే సహచరుడు, ప్రజా ఉద్యమాల్లో కలిసి నడిచే తోటి సోదరుడు అని అర్థం. జాతి నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఆ పదాన్ని గౌరవప్రదంగా ఉపయోగించారు. మతం, కులం పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టే సిద్ధాంతాలు కలిగిన బిజెపి పార్టీలో ఉండే నాయకులకు 'కామ్రేడ్' పదాన్ని పలికే నైతిక హక్కు లేదు" అని ఘాటుగా బదులిచ్చారు. నిజంగా నియోజకవర్గ ప్రజల క్షేమం కోరే వారైతే ప్రజాసమస్యలపై నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, వాటిని ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వీకరిస్తుందని తెలిపారు. అలా కాకుండా మీడియా ముందు మైలేజ్ కోసం అవాకులు చవాకులు పేలితే రాజకీయంగా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఏ కాంగ్రెస్ పార్టీని అయితే పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తిడుతున్నాడో అదే పార్టీ నుండి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎంపికైన విషయాన్ని మరువద్దని సూచించారు. నువ్వు చేసే పిచ్చి పనులకు ఇక్కడ ప్రజలు జూనియర్ కేఏ పాల్ అని మీపై ప్రచారం చేస్తున్నారని ఇది గమనించుకొని మసలుకోవాలని పేర్కొన్నారు. గతంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ అనుచరుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిని చెంపదెబ్బ కొట్టిన అంశాన్ని సైతం ఆయన ప్రస్తావించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంది తిరుపతి రెడ్డి, మహబూబ్, రమేష్, చంద్రశేఖర్ గౌడ్, చందం నరసింహులు, జంగయ్య, డిప్యూటీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముక్కు పోగులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణం చోరీ నిందితుల అరెస్ట్



కొడిమ్యాల, నవంబర్ 4 (నవగీతం) : మండలంలోని సూరంపేట గ్రామ శివారులో ఇటీవల బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్సై ఎ.నరేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు..గంగారాం తండాకు చెందిన అజ్మీర దూరి(50)రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు ఈ నెల 3 న చోరీకి గురి కావడం జరిగిందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్న క్రమంలో ఈ నెల 4 న(బుధవారం) నాచుపల్లి గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని పట్టుకొని విచారించగా వారే అట్టి దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించుకొని వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి దొంగిలించిన పుస్తెలతాడు, వారు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్





మల్లాపూర్,నవంబర్4,(నవగీతం) మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ దవ్వుల పద్మ నర్సయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారు చేస్తున్న సమయంలో అన్నం, కూరలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో భోజనానికి సంబంధించి లేదా ఇతర ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనం వండే వంట మనుషులతో మాట్లాడి, వారికి ఏవైనా ఇబ్బందులు ఉన్నా తనకు తెలియజేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా ఉపాధ్యాయులు, వంట సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దవ్వుల పద్మ నర్సయ్య, కార్యదర్శి కవిత,జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం చంద్ర ప్రకాష్, ఎంపీపీ ఎస్ హెచ్ ఎం లక్కిడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి డాక్టర్ ఎలేటి మల్లికార్జున్ రెడ్డి పరామర్శ



వేల్పూర్,నవంబర్ 4,(నవగీతం):నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామానికి చెందిన పాశవు చిన్నారెడ్డి (నన్నీ) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఎలేటి మల్లికార్జున్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ప్రమాద వివరాలను తెలుసుకుని, వారికిప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో వేల్పూర్ మండల బీజేపీ అధ్యక్షులు, సర్పంచ్ బెల్దారి నవీన్, మోర్తాడ్ మండల బీజేపీ అధ్యక్షులు శివానంద రెడ్డి,బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ తెలంగాణే టీఆర్ఎస్ సంకల్పం

రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ, ఎంబీసీకి టికెట్ ఇచ్చిన ఘనత కవితక్కదే

మల్కాజిగిరిలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో డా. రఘు



హైదరాబాద్,నవంబర్4,(నవగీతం): సామాజిక న్యాయ తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పనిచేస్తోందని హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్, కో ఆర్డినేటర్ డా. రఘు అన్నారు. ఇతర రాజకీయ పార్టీలు చేయని విధంగా రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ, ఎంబీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించిన ఘనత పార్టీ అధ్యక్షురాలు కవితక్కకే దక్కుతుందన్నారు.బుధవారం మల్కాజిగిరిలోని ఏఎస్ రావు నగర్‌లోని సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేముల భవాని ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరితో కలిసి డా. రఘు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం సాధనలో టీఆర్ఎస్ ముందుంటుందని చెప్పారు. సీనియర్ సిటిజన్లను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్యావంతుడైన ఆకాష్ సీనియర్ జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉన్నారని, పట్టభద్రుల తరపున మండలిలో గళం వినిపించేందుకు ఆయనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
5 నవంబర్ 2026

బిజినెస్

వరుసగా ఐదో రోజూ లాభాల పంట.. కారణాలివే..



భారతీయ స్టాక్ మార్కెట్లు మరోసారి తమ పట్టును నిరూపించుకున్నాయి. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు, అమెరికా మధ్యంతర ఎన్నికల ప్రభావం వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ దేశీయ ఈక్విటీ మార్కెట్ సూచీలు బుధవారం అదరగొట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సూచీలు వరుసగా ఐదో రోజు కూడా లాభాల బాటను వీడకుండా స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. ఈరోజు మార్కెట్ సెషన్ ప్రారంభంలో కొంత తడబాటు కనిపించినా మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు కోలుకుని లాభాలతో ముగిశాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 383.55 పాయింట్లు బలపడి 77,301.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 149.75 పాయింట్లు ఎగబాకి కీలకమైన 23,960.60 మార్కును తాకింది.

లాభాల వెనుక కొన్ని ముఖ్యమైన కారణాలు

కొంతకాలంగా అమ్మకాలకే పరిమితమైన విదేశీ సంస్థాగత మదుపర్లు ఇటీవల కాలంలో భారత మార్కెట్ల వైపు మళ్లీ దృష్టి సారించారు. బలమైన కార్పొరేట్ ఎర్నింగ్ అంచనాలు, లార్జ్-క్యాప్ షేర్లలో కనిపిస్తున్న ఆకర్షణీయమైన వాల్యుయేషన్ల కారణంగా ఎఫ్ఐఐల నుంచి మద్దతు లభిస్తోంది. నేటి సెషన్‌లో ఎఫ్ఎంసీజీ, రియల్టీ, మెటల్, మీడియా రంగాలు మంచి ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.55%, స్మాల్‌క్యాప్ 100 సూచీ సుమారు 2 శాతం మేర లాభపడటంతో మార్కెట్లో పాజిటివ్ సెంట్రిమెంట్ బలపడింది. ప్రస్తుతం విడుదలవుతున్న క్2 ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగా ఉండటంతో కంపెనీల షేర్లపై కొనుగోళ్ల ఒత్తిడి నెలకొంది. కీలక రంగాల కంపెనీల ఆదాయ వృద్ధి రేటు ఆశాజనకంగా ఉండటం మదుపర్లలో విశ్వాసాన్ని నింపింది. మొత్తం మార్కెట్ లాభాల్లో ముగిసినప్పటికీ గ్లోబల్ టెక్నాలజీ రంగానికి సంబంధించిన అనిశ్చితుల వల్ల నిఫ్టీ ఐటీ విభాగం మాత్రం 1 శాతానికి పైగా నష్టపోయింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. ప్రముఖ ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల సరళి, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తీరుతెన్నులను మదుపర్లు నిశితంగా గమనిస్తున్నారు. అయినప్పటికీ, దేశీయంగా బలమైన ఆర్థిక మూలాలు ఉండటం వల్ల నిఫ్టీ త్వరలోనే 24,000 మైలురాయిని అధిగమించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పసిడికి సుంకాల సెగ..

దేశంలో భారీగా పెరిగిన బంగారం స్మగ్లింగ్!

ముంబై : దేశీయంగా గోల్డ్ డిమాండ్ ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ3)లో ఏకంగా 29 శాతం క్షీణించింది. దిగుమతి సుంకాల భారం, పెరిగిన ధరలు, బంగారం కొనవద్దంటూ దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు నేపథ్యంలో 162.5 టన్నులకే పరిమితమైంది. ఈ క్రమంలో ఈ ఏడాది మొత్తంగా పసిడి కొనుగోళ్లు 6 ఏండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 625-675 టన్నులుగానే ఉండొచ్చని మంగళవారం విడుదల చేసిన 'క్యూ3 2026 గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్' నివేదికలో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా వేసింది. నిజానికి గత ఏడాది జూలై-సెప్టెంబర్‌లో బంగారం అమ్మకాలు 229.8 టన్నులుగా ఉన్నాయని గుర్తుచేసింది. కాగా, పెంచిన దిగుమతి సుంకాలతో దేశంలోకి గోల్డ్ స్మగ్లింగ్ భారీగా జరుగుతున్నదని ఈ సందర్భంగా డబ్ల్యూజీసీ చెప్పడం గమనార్హం. అలాగే పుత్తడి ధరలు పెరిగిన నేపథ్యంలో గోల్డ్ సేల్స్ తగ్గినా విలువపరంగా మాత్రం 3 శాతం పెరిగి రూ.2,41,900 కోట్లుగా ఉన్నది. నిరుడు దాదాపు 230 కోట్ల విక్రయాలు జరిగినా.. దాని వాల్యూ రూ.2,35,090 కోట్లుగానే ఉన్నది.

దేశీయంగా ఈ జూలై-సెప్టెంబర్‌లో 10 గ్రాముల బంగారం రేటు (జీఎస్టీ, దిగుమతి సుంకం లేకుండా) సగటున రూ.1,48,891 (ట్రాయ్ ఔన్స్ 4,262 డాలర్లు) పలికింది. గత ఏడాది ఇదే వ్యవధిలో రూ.1,02,287 (3,457 డాలర్లు)గానే ఉన్నది.

ఆభరణాలకు డిమాండ్ 20 శాతం పతనమై 99.9 టన్నులుగా ఉన్నది. నిరుడు 125 టన్నులు.

బంగారం కడ్డీలు, నాణేలకు ఆదరణ మునుపటితో చూస్తే 40 శాతం తగ్గింది. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 91.6 టన్నులుగా ఉంటే.. ఈ ఏడాది కేవలం 55 టన్నులుగానే ఉన్నది.



గోల్డ్ ఈటీఎఫ్‌ల మొత్తం డిమాండ్ కూడా 50 శాతం క్షీణించింది. 10.7 టన్నుల నుంచి 5.3 టన్నులకు దిగజారింది.

దేశీయంగా ఈ 3 నెలల్లో రీసైకిల్డ్ గోల్డ్ 19.2 టన్నులుగా నమోదైంది. నిరుడు 21.8 టన్నులు.

నికరంగా పుత్తడి దిగుమతులు ఈ జూలై-సెప్టెంబర్‌లో గతంతో పోల్చితే 46 శాతం తగ్గి 114.1 టన్నులుగా ఉన్నాయి. క్రిందటిసారి 211.9 టన్నులుగా ఉన్నది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ జూలై-సెప్టెంబర్ గోల్డ్ డిమాండ్ 1 శాతం తగ్గి 1,369 టన్నుల వద్ద స్థిరపడింది. అధిక, నిలకడలేని ధరలే కారణమని డబ్ల్యూజీసీ పేర్కొన్నది. నగల డిమాండ్ 17 శాతం దిగి అత్యంత కనిష్ఠంగా 313 టన్నులుగా ఉన్నది. కరోనా సమయంలోనూ 331 టన్నులకు డిమాండ్ కనిపించినట్టు తెలిపింది. చైనాలో 22 శాతం తగ్గగా, భారత్‌లో 19.5 శాతం పడిపోయినట్టు వివరించింది. అమెరికా, మిడిల్ ఈస్ట్, సౌదీ అరేబియా తదితర దేశాల్లోనూ డిమాండ్ తగ్గుముఖం పట్టడం వరల్డ్ గోల్డ్ మార్కెట్‌ను ప్రభావితం చేసినట్టు డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ పీటీఐకి తెలిపారు.

తగ్గిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు మంగళవారం తగ్గాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి రేటు రూ.700 క్షీణించి రూ.1,41,800 వద్ద నిలిచింది. అలాగే కిలో వెండి విలువ రూ.2,000 పతనమై రూ.1,84,000గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం పసిడి ధర రూ.1,28,000 పలికింది. ఇక అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్స్ గోల్డ్ రేటు 41.19 డాలర్లు దిగి 3,905.44 డాలర్లుగా ఉన్నది. సిల్వర్ 48.97 డాలర్లుగా ట్రేడైంది. కాగా, రాబోయే ధనత్రయోదశి, దీపావళి సందర్భంగా దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి కొనుగోళు ఊపందుకోవచ్చన్న ఆశాభావాన్ని జ్యుయెల్లర్స్ వ్యక్తం చేస్తున్నారు. దేశీయ గోల్డ్ మార్కెట్‌ను ఈ జూలై-సెప్టెంబర్ నిరాశపర్చినా.. చివర్లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో అప్పటిదాకా తమ కొనుగోళ్లను వాయిదావేసిన చాలామంది తిరిగి ముందుకొచ్చారు. అలాగే దక్షిణ భారతంలో పెండ్లిళ్లు, పండుగల సీజన్ సేల్స్‌కు కలిసొచ్చింది. నగల వర్తకుల ఎక్స్‌పెండ్ అఫర్లూ కొనుగోలుదారుల్లో కొంత ఉత్సాహాన్నైతే నింపాయి. మొత్తానికి ఈ త్రైమాసికంలో అధికారికంగానైతే బులియన్ దిగుమతులు బాగా పడిపోయాయి. కానీ స్మగ్లింగ్ పెరిగిందన్న సంకేతాలైతే ఉన్నాయి. ఇక రీసైక్లింగ్ సైతం అంతంతమాత్రంగానే జరిగింది. అయితే ప్రస్తుత పండుగ సీజన్‌లో గోల్డ్ మార్కెట్ మళ్లీ కళకళలాడే అవకాశాలున్నాయి. తగ్గుతున్న ధరలు సైతం డిమాండ్‌ను పెంచవచ్చు. తేలికపాటి నగలకు ఆదరణ, ఎక్స్‌పెండ్ అఫర్ల హవా కనిపించవచ్చు.

బాల కార్మిక చట్టాల అమలుకు ప్రత్యేక సెల్

దేశంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చట్టాల అమలు తీరుపై సుప్రీంకోర్టు కఠినమైన వైఖరిని ప్రదర్శించింది. బాల కార్మిక (నిషేధ, నియంత్రణ) సవరణ చట్టం నిబంధనలను మరింత పకడ్బందీగా అమలు చేయడానికి, దేశవ్యాప్తంగా పర్యవేక్షణను తీవ్రతరం చేయడానికి ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ ప్రత్యేక సెల్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు సంబంధించి కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. బాల కార్మిక చట్టాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడటం వల్ల క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదని కోర్టు తెలిపింది. దీన్ని నివారించేందుకే ఈ సెల్ ఏర్పాటు అత్యవసరమని అభిప్రాయపడింది.



చట్టం అమలులో లోపాలపై కోర్టు అసంతృప్తి

కాగితాలపై చట్టాలు పటిష్టంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు నామమాత్రంగానే సాగుతోందని సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పేదరికం, ఉపాధి అవకాశాల లేమి వంటి సామాజిక కారణాలను అడ్డుపెట్టుకుని చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్న ఉల్లంఘనలను సహించేది లేదని హెచ్చరించింది. పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీలు, గృహ కార్మికులుగా చిన్నారులను వినియోగిస్తున్న తీరుపై మరింత కఠిన నిఘా అవసరమని ధర్మాసనం నొక్కిచెప్పింది.

ప్రత్యేక సెల్ ప్రధాన విధులు దేశవ్యాప్తంగా బాల కార్మిక నిషేధ చట్టం అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం. రక్షించిన బాలలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పన పథకాలను సక్రమంగా అందేలా చూసి వారిని భవిష్యత్తుకు ధీమా కల్పించడం. చట్టాల ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకునేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్..

తొలి వన్డేలో కివీస్‌పై భారత్ ఘనవిజయం





కివీస్‌తో తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో భారత్ గెలుపు

వర్షం కారణంగా లక్ష్యాన్ని 143 పరుగులకు కుదింపు

విరాట్ కోహ్లీ అద్భుతమైన 74 పరుగుల ఇన్నింగ్స్

భారత పేసర్లు అర్ష్‌దీప్, గుర్నూర్, కంబోజ్ అద్భుత ప్రదర్శన

185 పరుగులకే కుప్పకూలిన న్యూజిలాండ్ జట్టు

ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం పదేపదే అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (74) క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత యువ పేస్ త్రయం అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్ అద్భుతంగా రాణించారు. మేఘావృతమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ కివీస్ బ్యాటర్లను ఆరంభం నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ 4 వికెట్లతో చెలరేగగా, గుర్నూర్ 3, అన్షుల్ 2 వికెట్లు పడగొట్టారు. వీరి దెబ్బకు న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. కివీస్ జట్టులో ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. అయితే చివర్లో బ్లెయిర్ టిక్నర్ కేవలం 23 బంతుల్లో 4 సిక్సర్లతో 34 పరుగులు చేసి అనూహ్యంగా మెరిశాడు. అయినప్పటికీ కివీస్ జట్టు 200 పరుగుల మార్కును కూడా దాటలేకపోయింది. లక్ష్య ఛేదనలో టీమిండియా ఆరంభంలోనే ఒక వికెట్ కోల్పోయినా, విరాట్ కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో తన 80వ అర్ధశతకాన్ని నమోదు చేసిన కోహ్లీ, మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (37)తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. భారత ఛేదన సమయంలో వర్షం రెండుసార్లు అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి (డీఎల్ఎస్) ప్రకారం లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించారు.

ఈ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే, లక్ష్యానికి చేరువవుతున్న సమయంలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. అయినప్పటికీ, చివరకు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి సునాయాసంగా విజయాన్ని అందుకుంది.

స్పోర్ట్స్

రోహిత్ భాయ్ చేసిన

ఆ రనౌటే మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్: గిల్

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై 5 వికెట్ల తేడాతో భారత్ విజయం

యువ బౌలర్లు అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్ అద్భుతంగా రాణించారని ప్రశంస

లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ మా పనిని సులభం చేసిందన్న కెప్టెన్

స్థిరత్వంతో ఇదే ప్రదర్శన కొనసాగించడమే లక్ష్యమని స్పష్టం



న్యూజిలాండ్ తో వన్డే సిరీస్ ను భారత జట్టు విజయంతో ప్రారంభించింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) కివీస్‌పై ఘన విజయం సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, విజయం అనంతరం మాట్లాడుతూ జట్టు ప్రదర్శనపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాడు. ముఖ్యంగా సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ చేసిన ఒకే ఒక్క రనౌట్, మ్యాచ్ గతిని పూర్తిగా మార్చేసిందని ప్రశంసించాడు. మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ, "మా బౌలింగ్, ఫీల్డింగ్ ఈరోజు చాలా అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా రోహిత్ భాయ్ చేసిన రనౌట్ ఆటలో పరిస్థితిని మా వైపు తిప్పింది. అదే మ్యాచ్‌కు కీలక మలుపు అని నేను భావిస్తున్నాను. మిచెల్, ఫిలిప్స్ మధ్య భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో ఆ వికెట్ పడటం మాకు ఎంతో కలిసొచ్చింది. వారు గతంలో భారత్‌లో కూడా అద్భుతంగా ఆడారు. వారిద్దరినీ విడదీయడం కీలకం అయింది. ఓవరాల్‌గా ఇది ఒక గొప్ప జట్టు ప్రదర్శన" అని వివరించాడు. యువ బౌలర్ల ప్రదర్శనపై గిల్ ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించాడు. "ఇక్కడి పరిస్థితులకు అన్షుల్ కంబోజ్ లాంటి బౌలర్ కరెక్ట్‌గా సరిపోతాడు. అతను ఎప్పుడూ చురుగ్గా ఉంటూ బంతిని సీమ్ చేయడానికి ప్రయత్నిస్తాడు. పాత బంతితోనూ అతను చాలా ప్రభావవంతంగా ఉంటాడు. మరోవైపు, వికెట్ నుంచి పెద్దగా సహకారం అందని సమయంలో గుర్నూర్ బ్రార్ తన పేస్, అదనపు బౌన్స్‌తో ప్రభావం చూపగలడు. ఇవాళ వారిద్దరూ బౌలింగ్ చేసిన తీరు చూడటానికి అద్భుతంగా అనిపించింది" అని అన్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం కలగడం, లక్ష్యాన్ని కుదించడం వంటి అంశాలపై స్పందిస్తూ, "ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకున్న తర్వాత వర్షం పడి ఆట ఆగితే తిరిగి ఏకాగ్రత సాధించడం అంత సులభం కాదు. వర్షం తర్వాత పిచ్ వేగం కొద్దిగా పెరిగింది, బంతి మరింత చురుగ్గా కదిలింది. లక్ష్యం కూడా తగ్గడంతో మేం మా సాధారణ ఆట ఆడేందుకే ప్రయత్నించాం. ఆ సమయంలో విరాట్ భాయ్ ఆడిన తీరు మా పనిని చాలా సులభతరం చేసింది" అని గిల్ పేర్కొన్నాడు. తదుపరి మ్యాచ్‌కు జట్టులో చేయాల్సిన మార్పులపై అడగ్గా, "ప్రత్యేకంగా మార్పులేమీ అవసరం లేదు. మాకు స్థిరత్వమే ముఖ్యం. ఇదే ప్రదర్శనను మళ్లీ మళ్లీ పునరావృతం చేయగలిగితే, మేం చాలా మంచి స్థితిలో ఉంటాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌట్ అయింది. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా నిర్దేశించగా, జట్టు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
5 నవంబర్ 2026



కిరణ్ అబ్బవరం ‘హతః’ విడుదల వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా వ్యవహరిస్తున్న రెండో చిత్రం ‘హతః’ విడుదల వాయిదా పడింది. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. అయితే, బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాల పోటీ ఎక్కువగా ఉండటం, ప్రేక్షకులకు థియేటర్లలో సరికొత్త, అత్యుత్తమ సౌండ్ అండ్ విజువల్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ చిత్రంలో కుష్ణ మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవి, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర బృందం స్పష్టం చేసింది.

అఫిషీయల్.. రజనీకాంత్ ‘ధర్మన్’లో శ్రీలీల!



సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘ధర్మన్’. యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా లెజెండరీ నటుడు కమల్ హాసన్‌కు చెందిన ‘రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్’ మరియు ‘టర్మరిక్ మీడియా’ బ్యానర్లు సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కొద్దికాలంగా సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాలలోనూ శ్రీలీల ఈ చిత్రంలో నటిస్తారనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంటూ.. టాలెంటెడ్ నటి శ్రీలీల ‘ధర్మన్’ చిత్రంలో భాగం కాబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఇప్పటివరకు చూడని విభిన్నమైన పాత్రలో వైద్యుడిగా (డాక్టర్) కనిపించనున్నట్లు తెలుస్తోంది. కేవలం రజనీకాంత్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో ఎంపిక చేసిన తారాగణం కూడా చాలా ప్రత్యేకంగా ఉంది. రామ్ పోతినేని, గ్లామరస్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, స్టార్ హీరోయిన్ నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇంతమంది స్టార్స్ ఒకే సినిమాలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.

ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు.. ఆసక్తికరంగా ‘మాయ లేడీ’ ట్రైలర్!

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న రాకేష్ వర్రె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘మాయ లేడీ’ తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు ఉంటే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఫుల్ టైం కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రాకేష్ వర్రె మరియు మధుమితల నటన, విజువల్స్ మరియు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవారికి మంచి విజువల్ ట్రీట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.



మిక్స్‌డ్ టాక్‌ను తట్టుకుని నిలబడిన ‘రణబాలి’.. బాక్సాఫీస్ వద్ద రూ.82 కోట్ల గ్రాస్ కలెక్షన్లు!



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో భారీ అంచనాల మధ్య విడుదలైన ‘రణబాలి’ చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. సినిమా విడుదలైన ప్రారంభంలో కొన్ని మిక్స్‌డ్ టాక్ మరియు భిన్న స్పందనలు వచ్చినప్పటికీ, వీకెండ్స్ మరియు వర్కింగ్ డేస్‌లోనూ సినిమా వసూళ్లు మాత్రం ఎక్కడా తగ్గకుండా నిలకడగా కొనసాగుతున్నాయి. చిత్రానికి ఉన్న క్రేజ్ మరియు బీ, సీ సెంటర్స్ లో లభిస్తున్న ఆదరణ కారణంగా కలెక్షన్లు స్థిరంగా వస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం, ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 82 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లను సాధించినట్లు అంచనా వేస్తున్నారు. థియేట్రికల్ రన్‌తో పాటు ఈ సినిమా నాన్-థియేట్రికల్ బిజినెస్ కూడా భారీ స్థాయిలోనే జరిగినట్లు తెలుస్తోంది. శాటిలైట్, డిజిటల్ (ఓటీటీ) మరియు ఆడియో రైట్స్ రూపంలో నాన్-థియేట్రికల్ బిజినెస్ ద్వారా సుమారు రూ. 85 కోట్లు రాబట్టినట్లు సమాచారం.



‘మహంతి ఝాన్సీ రాణి అనే నేను’.. కింగ్100 టబు గ్లింప్స్

అక్కినేని నాగార్జున 100 వ చిత్రం ‘కింగ్ 100’. ఈ సినిమా నుంచి ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ‘మనుషుల్లో రెండు రకాలు.. కష్టాన్ని నమ్మేవాళ్లు, అదృష్టాన్ని నమ్మేవాళ్లు. ‘మహంతి ఝాన్సీ రాణి అనే నేను’.. అంటూ ఆమె చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. ఈ సినిమాకి దేవీశ్రీ ప్రసాద్ గట్టిగానే మ్యూజిక్ అందించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. రా. కార్తిక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న ‘కింగ్ 100’ డిసెంబర్ 24 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నాగార్జున 100వ చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి గ్లింప్స్ కూడా ఆకట్టుకుంది.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001. Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184. Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.